REGD. NO.
M. 4707


BALA



# బాల

పిల్లల బొమ్మల పత్రి


6 అణాలు



చి॥ హరనాథ్ (రాజమండ్రి)



చి॥ ఘంటసాల యదుగిరి (మదరాసు)



అశోకా పాపలు

ఈ ఐదుగురు పాపలూ అశోకా ఆమ్లా తలనూనెనే వాడ్తారట.

వాళ్ల పేర్లు:

(నిలుచున్నవారు) చి॥ డి. వి. సురేంద్రగుప్త, నాగేంద్రగుప్త; (కూర్చున్నవారు) చి॥ కాంతి కుమారి, నిర్మలాకుమారి, [illegible] గుప్త.





# ఆరోగ్యం—ఆనందం

పాపలకు కావలసినవి ఈ రెండే

సాధారణంగా పాపలకు జీర్ణశక్తి మందంగావుంటుంది. ఆహారం ఏమాత్రం ఎక్కువే తిన్నా, లేక, తిన్న ఆహారం సరిపడకపోయినా అజీర్ణం, కడుపునొప్పి వస్తుంది. అట్టి సమయములలో పాపాయిలు ఏడుస్తారు. తెలివిగల తలిదండ్రులు ఇది గ్రహించి

పాపలకు **జేమ్సు గ్రైప్-స్టాప్ వాటర్**ను ఇస్తారు.

తియ్యగా, రుచిగావుండు ఈ గ్రైప్‌వాటర్ పాపల పాలిటి అమృతమే! వివరములకు:

**జేమ్సు పెర్‌ఫ్యూమరీ కంపెనీ**

1/5, వ్యానల్లు రోడ్, ఎగ్మోర్, మద్రాసు-8.




## *James* GRIPE-STOP WATER

JAMES CHEMICAL LABORATORIES, MADRAS.

# అమృతాంజనము

అమృతాంజనము వాడవేమి !

నీదు - ఆదివ్యాధుల బాయవేమి ;

1 ప్రతిష్ఠాపునందదది, సులభముగ చిక్కును
ఎటువంటినొప్పిని తృటిలోన నొక్కును
మితమైన వెలయనుచు మిగుల పేరెక్కును
తత్ఖ్యాతితోడ సంతతము అదిచొక్కును ॥అమృ॥

2 తలనొప్పి దానివాసనగొని తొలగును
కీళ్లనొప్పులు దానికీ వెఱిగితొలగును
పడిశములు దానిసంపర్కమున బఱచును
జలుబు రొంపలు దానిచాయగని వెఱచును ॥అమృ॥

3 ఆరోగ్యమున తేరి ఐశ్వర్యమునమీరి,
దేశీయ జాతీయ స్వాతంత్ర్యమునుగోరి,
పోరాడుచుండు వీరులకు, ఉద్యోగులకు,
కూరిమిని గూర్చగల సారమని తెలిసికొని ॥అమృ॥

4 అమృతాంజనం బవసరములేని దేహంబు
జగతిలో లేదనుచు చాటుప్రతిగేహంబు
విడువుమయ్యా ఇంక వెడగుసందేహంబు,
తడబడకపిదప సంగ్రహముంచు వేగంబు ॥అమృ॥


గరిమెళ్ల సత్యనారాయణ, బి. ఎ.

# భూమినుండి సంపద





## ప్రత్తి




ప్రత్తినుండి గుడ్డను తయారుచేయుట మనకు పురాతనమైన చాలపెద్ద పరిశ్రమ. వివిధరకముల నేతను, మాపులను సాటిలేని భారతదేశపు నేతగాండ్ర యొక్కకృషి ప్రపంచమందన్నిచోట్ల ప్రశంసింపబడినది. మొగలాయి చక్రవర్తి ఔరంగజేబు ఒకసారి తన కుమార్తెవంటిపై చీర చాలతక్కువగానున్నందుకు మందలించెను. అందుకామె అభ్యంతరముచెప్పి, చీరను ఏడుసార్లు తనచుట్టూతిప్పి తాను ధరించెనని జవాబు చెప్పెను.

మొదటినేతమిల్లు బొంబాయిలో 1853 సం॥ లో స్థాపించబడెను. నేడు బొంబాయిలో 69 మిల్లులు, ఇండియా పాకిస్తానులలో కలిపి 390 మిల్లులు కలవు. వీటన్నింటిలో మొత్తము 4 లక్షల కార్మికులు పనిచేయుచున్నారు. ప్రత్తి నేత మిల్లులుగల రెండవ పెద్దకేంద్రము అహమ్మదాబాదు.

ప్రక్కనున్న పటములో ప్రత్తి అధికముగా పండు ప్రదేశములు గుర్తింపబడినవి.

ప్రత్తిలో రెండురకములున్నవి. ఒకటి "పొట్టి పీచులు గలది;" ఇది ముతకగుడ్డ తయారుచేయుటకు, రెండవది "పొడుగు పీచులుగలది"—సన్నగుడ్డ నేయుటకు.




రాబోవు సంచికలో మరియొకదానికై నిరీక్షించండి.

ప్రకటనదారులు:

హమాం & 501 సబ్బులను తయారుచేయు

**ది తాతా ఆయిల్ మిల్స్ కం॥ లి॥**

ఆంధ్రదేశంలో అన్ని ముఖ్య కేంద్రాలలో

త్వరలో విడుదల

కమలా కోట్నీస్—చంద్రకళ—రంగరాజు—డాక్టరు
సుబ్బారావు—శివరావు—మున్నగువారు నటించిన

# = సామ్రాట్ విక్రమార్క =

డైరక్షన్: పాండురంగ కోట్నీస్

## ప్రభాత్ అండ్ మాచిరాజు సుబ్బారావు

## జాయింటు ప్రొడక్షన్

ఆంధ్ర-దత్త-నైజాం:

రాజశ్రీ పిక్చర్సు,
బెజవాడ

మైసూరు

తల్లం పిక్చర్సు
బెంగుళూరు

మాచిరాజు సుబ్బారావువారి మరో తెలుగు జానపద చిత్రరాజము

# ★ తారావళి ★

మరియు...... శ్రీశైల మహాత్మ్యము
త్వరలో సెట్సుమీదకు పోనున్నది.

వివరాలకు:

మాచిరాజు సుబ్బారావు
ప్రొప్రయిటరు
శివరామ్ ప్రొడక్షన్సు
(విశాఖపట్టణం)

లేదా

ఎస్. రామమోహనరావు
32, T. A. ముదలీ స్ట్రీట్
మైలాపూరు
మదరాసు 4

మా సలహా

మీకు కావలసిన అన్ని
రకాల పెన్సిళ్లకు

ది
## మద్రాస్ పెన్సిల్ ఫ్యాక్టరీ

●

మంచి ఉన్నత శ్రేణికి చెందిన
ముద్రణావసరాలకు
లితోగ్రాఫ్ పనులకు

## హో అండ్ కో

●

ఉత్తమ తరగతికి చెందిన
అన్నిరకాల స్టేషనరీకి
* సుఖ్యాతి *

## వి. పెరుమాళ్ చెట్టి అండ్ సన్స

★

5, స్ప్రింగర్ స్ట్రీట్
జి. టి. మద్రాసు


AAS.

సుప్రసిద్ధమైన

## అశోకా ఆమ్లా

## హేర్ ఆయిల్

పరిమళము - చల్లదనము




…లా!

…కురులు నిగనిగలాడుతూ …గాను, పొడువుగాను, …డాలంటే అశోకా …మ్లాను ఒకసారి వాడిచూడు. అందానికి, …లు, కురులకు అశోక ఆమ్లా అన్నమాట …చిపోకు! తయారుచేయువారు:

**…జయా కెమికల్ అండ్ టాయిలెట్ వర్కుస**

21, 22, సూర్యనారాయణ చెట్టి వీధి,
రాయపురం - మదరాసు.

# బాల

పిల్లల బొమ్మల పత్రిక

## చందా వివరాలు

సాలుకు చందా రూ 5/-లు
(ప్రత్యేక సంచికలతో సహా)
వీ. పీ. లు పంపబడవు.
అర్ధసం॥ చందాలు అంగీకరింపబడవు.

## ప్రకటన రేట్లు

పూర్తిపేజీ—రూ 50/-
అర్ధపేజీ—రూ 30/-
కవరు పేజీ—రూ 120/-
(రెండు రంగులలో)

వివరములకు వ్రాయండి.

## రచనలు

● రచనలు పంపువారు తమదగ్గర ఒక కాపీవుంచుకొని పంపాలి. రచనలు తిరిగి పంపబడవు.


● రచన బాగుంటే మేమే వీలును బట్టి ప్రచురిస్తాము. అనవసరముగా ఉత్తర ప్రత్యుత్తరములు చేయవద్దని మనవి.

● రచనలో విజ్ఞానంగాని వినోదంగాని వుండాలి. వాచకపుస్తకాలలోని రచనలు పంపవద్దు.

● హాస్యచిత్రములు పంపిన అంగీకరింతుము.

మేనేజరు "బాల"

మైలాపూరు, మదరాసు 4.




**'BALA'** CHILDREN'S ILLUSTRATED MONTHLY

సంపాదకుడు: న్యాయపతి రాఘవరావు. బి.ఎ.

సహాయ సంపాదకురాలు: న్యాయపతి కామేశ్వరి బి. ఎ., ఎల్.టి.

సంపుటి 3] జూలై 1948 [సంచిక 12

# కేసరీ కన్యావిద్యాలయము

మైలాపూరులో తెనుగు పిల్లల చదువుకోసం ఇదివరలో కేసరీ హైస్కూలును పెట్టారని మీకు తెలిసినవిషయమే. ఈ హైస్కూలులో మొగపిల్లలు, ఆడపిల్లలూ ఇన్నాళ్లూ కలిసి చదువుతున్నారు. డాక్టరు కేసరి గారు ఈ హైస్కూలునకు అప్పుడే సుమారు ఒకలక్ష యాభై వేల రూపాయిలు విరాళమిచ్చారు. ఇంతేకాకుండ ఆడపిల్లలకు ప్రత్యేకంగా ఒక స్కూలు వుండాలని డాక్టరు కేసరిగారి కోరిక. అందుకనే గత సంవత్సరం, ప్రత్యేకంగా మరల ఒక లక్ష రూపాయలు విరాళం ఇచ్చారు. దానిఫలితంగా ఈ సంవత్సరం తెనుగు బాలికల కొరకు కేసరీ కన్యావిద్యాలయం మైలాపూరులో స్థాపించబడింది.

ఈ విద్యాలయ ప్రారంభోత్సవం జూన్ 24 తేదీని విజయనగరం మహారాణి శ్రీ విద్యావతీ దేవిగారు జరిపారు.

మదరాసు బడులలో తెనుగు లేకుండా చేద్దాం అని అరవలు కంకణం కట్టుకొన్న ఈ రోజుల్లో ఇటువంటి విద్యాలయాలు ఎంతో అవసరము.

ముఖ్యంగా మదరాసు కార్పొరేషను బడులన్నిటిలోను తెనుగు క్లాసులు పెట్టించాలి. మదరాసులోని తెనుగువారందరూ ఈ విషయంలో గట్టిపట్టుదలతో పని చేయాలని కోరుచున్నాము.

కొత్తగా పెట్టబడిన కేసరీ కన్యావిద్యాలయానికి మా ఆశీస్సులు.




రాము, వేణు, సీను, వెంకు పరీక్ష ప్యాసయినారు.

సోము పరీక్ష పోయింది.

●

రాము, వేణు, సీను, వెంకు దర్జాగా ఫస్టుఫారంలోకి వెళ్తున్నారు!

●

సోమో? అదుగో పాపం ఏడుస్తూ తిరిగి 5 వ క్లాసుకే వెళ్తున్నాడు.

రాము, వేణు, సీను, వెంకు అందరూ కష్టపడి శ్రద్ధగా, బుద్ధిగా చదివారు.

సోము, సరిగ్గా చదవక తిరిగాడు.

రాము ప్యాసు, సోము ఫెయిలు!

## రాము సంతోషం

రాము పరీక్ష ప్యాస
యాడు. బలేసంతోషం.
అదుగో నవ్వుతున్నాడు.

★

## సోము ఏడుపు

సోము పరీక్ష పో
యింది! బహువిచారం.
అదుగో సోము ఏడుస్తు
న్నాడు.




Phone No. 3189 Grams: PERMANANCY, Madras

# కృష్ణవేణి సిరాలు




ఉల్లమలరఁజేయు నల్లఁదనమునందు,
పరుగుతరుగులేని పాఱుదలను.
ఎదకు నింపుఁగూర్చు కృష్ణవేణిసిరాలు,
పొదలు కృష్ణవేణి నదినిబోలి.


## కృష్ణవేణి సిరాలు

స్టేషనరీవర్తకులందరివద్దను దొరకును.

మద్రాసు, దక్షిణ జిల్లాలకు ఏజెంట్లు :

**శ్రీ సి. ఆర్. తిరుమల్‌పాడ్**

141, గోవిందప్పనాయకన్ వీధి-మద్రాసు 1.



# బాలా!

(పావుల పజిల్)

ఇది దేని తోక?

ఇది తోకేనా?

ఈ చెవులు దేనివి?

ఇవికూడా చెవులేనా?

(జవాబులు ఆఖరు పేజీలలో)

# ఏటి అర్థాలు ?


బాలా !

ఈ మాటలు మనం తరచు వాడుతూవుంటాం. వాటి అర్థాలు మీకు తెలుసా ?

1. నూటపదకొండు
2. కురిడీకొబ్బరి
3. కొత్తిమిరికట్ట
4. తిరుపతిమెట్లు
5. మొసలికన్నీరు
6. ఎలుకతోక
7. ముగ్గుబుట్ట
8. బిక్కవోలుతూము
9. గాలిమేడ
10. పాముచెవులు
11. కుందేటికొమ్ము
12. పండితపుత్రుడు.
13. కాయా పండా ?
14. చిలుకా గోరింకా
15. నూతిలోకప్ప
16. కాకిగోల
17. అరణ్యరోదన
18. కొంగజపం
19. గోడకుచెవులు
20. చెట్టుమీదపక్షి

కూర్పు: బి. సూర్యప్రకాశరావు
(నిడదవోలు)

(జవాబులు ఈసంచికలోనే)



# అబ్బే! నాకు కోపం లేదండీ!

రచన: వై. దేవదాసు

ఒక రోజున నేను అలా వెళ్తూ వుంటే, ఒకచోట ఒక గుంపు కనిపించింది. ఆ విచిత్ర మేమిటో చూద్దాం అని అక్కడికి వెళ్లేను.

అక్కడ మునీశ్వరుడి వేషంలో వున్న ఒక స్వామీజీ ఉపన్యశిస్తున్నాడు. ఏమిటంటే—

"ప్రజలారా! కోపము చాలా చెడ్డది. దానివల్ల సర్వనాశనం కలుగుతుంది. నాకు కొంచెం కూడా కోపంలేదు అని నేను గర్విస్తున్నాను"—అని అన్నాడు.

నేను ఆయన దగ్గరికెళ్లి ఇలాగ ప్రశ్న వేశాను:

"స్వామీజీ! మీకు కొంచెమైనా కోపంలేదా?"

"లేదండి"

"కొంచెం కూడా లేదా?"

"లేదండి."

"అయితే అసలు కోపమే లేదన్న మాట!"

"అవునండి"

"ఎల్లాగైనా అప్పుడప్పుడు కొంచెం కోపం వస్తుంది కదండీ"— అని మళ్లీ అడిగాను.

అతడు కోపం పట్టలేక పోయాడు. "లేదయ్యా అంటే ఎన్ని సార్లయ్యా అడుగుతావు!" అని కళ్లెర్రచేసి, కోపంగాఅన్నాడు.

"ఇది కోపంకాక మరేమిటండీ" అని నేను చల్లగా అన్నాను. అందరూ పకపక నవ్వేరు. స్వామీజీ తల వంచుకున్నాడు.


---

# బడిలో బాల

కొక్కొరో కోయని
కోడి కూసింది
మాయమ్మ లేచింది
మజ్జిగ చేసింది.
మానాన్న లేచాడు
మమ్ము లేపాడు.
మాఅక్క వచ్చింది
మమ్ము పిలిచింది
మేమంత లేచాము
మోము కడిగాము
చక్కని దుస్తులను
సరిగ తొడిగాము
చల్దిఅన్నము అంత
చల్లగా తినుచు
వడి వడిగ పోతిమీ
బడికి మేమంత
బడిలోని పాఠాలు
బహుశ్రద్ధ చదివి
వడి వడిగ వచ్చితిమి
బడి వదలగానే!

రచన: గోపాల్ (జిల్లెపల్లి)

# పెద్ద పిట్టను చిన్న పంజరంలో పెడితే!



రచన : వై. వెంకటేశ్వరరావు (రాజమహేంద్రవరం)


## WEST END & FAVRE LEUBA WATCHES

**From Rs. 130 to Rs 145**

OTHER VARIETIES







R. G. $5\frac{1}{4}$ Tanoeu & Rect. 15 Jewels Rs. 75 for ladies

Guaranteed for 10 years

**Nickel $10\frac{1}{2}$ Flat 5 Jewels Red Centre Second for Sportsmen and Medical Practitioners**

Rs. 40

Guaranteed for 2 years

**R. G. $7\frac{3}{4}$ Curvex and Rectangular 15 Jewels Rs. 75 for Gents.**

**Guaranteed for 10 yrs.**

*All orders to accompany with 25% of value as advance.*

RIZVON & BROS.,—217, China Bazar, G. T., Madras.



# మొద్దబ్బాయి
## (5 దో క్లాసు)
# పుష్కరం
(1937 — 1948)

బాలా!

ఈ మొద్దబ్బాయిని చూచావా ఎలాగ నవ్వుతున్నాడో! ఇతడే రేడియో మొద్దబ్బాయి. ఆ నవ్వే సిగ్గులేని నవ్వు. అలా సిగ్గులేని నవ్వు ఎందుకు నవ్వుతున్నాడో తెలుసా?

మొద్దబ్బాయి పరీక్షఫలితాలు మొన్ననే తెలిశాయి. 5 దో క్లాసులో 1936 సం॥లో ప్రవేశించి, ప్రతీయేడూ ఫెయిలవుతూ ఈ ఏడు కూడా ఫెయిలయాడు! అంటే 12 సం॥లు ఒకేక్లాసులో ఓపికతో చదివి పట్టుదలతో ఫెయిలవుతూవచ్చాడు. ఇటువంటి ఘన కార్యం ఇంకెవ్వరూ చేయ లేదు. అంచేత మొద్దబ్బాయి అపజయ పుష్కర మహోత్సవం ఈమధ్యనే రేడియో ఆటవిడుపు ప్రోగ్రాములో జరిపారు. నువ్వు వినేవుంటావు.

ఇదుగో మొద్దబ్బాయి చిల్లుకానీమీద రాసినపాట:

అమ్మనాకు చిల్లుకాని ఒక్కటి నాకియ్యవే
చిల్లుకాని చేతబట్టి చకచకా నడుస్తాను
చాక్ లేటు కొనుక్కోని గుప్‌చప్పని తింటాన్
రెండుకానులిస్తేను బండిచేసుకుంటానే
బండిమీద గణగణమని బడికిపోయి వత్తానె
జీడిపప్పు కొంటా - కొమ్ముశెనగలు కొంటా
అన్నికొని ఒక్కడనే - అట్టే నేను తింటా ॥అమ్మ॥

# “మై హెడ్”

(MY HEAD)

రచన : పాలంకి వెంకటేశ్వర్లు
(పి. ఆర్. కాలేజి, కాకినాడ.)

ఒక ఊళ్ళో ఒక అబ్బాయి ఉండేవాడు. ఆ అబ్బాయికి ఒకనాడు ప్రైవేటు మాస్టారు పాఠము చెబుతూ “మైహెడ్ అంటే నా తలకాయి” అని చెప్పేరు.

ప్రైవేటు పూర్తి అయిన తరువాత ఆ అబ్బాయి ఇంట్లో “మైహెడ్—మేష్టారి తలకాయి మైహెడ్—మేష్టారి తలకాయి” అంటూ చదవడం మొదలు పెట్టాడు. అప్పుడు వాళ్ళనాన్న గారు వచ్చి “మైహెడ్ అంటే నాతలకాయిరా” అని చెప్పేరు. అప్పుడు ఆ అబ్బాయి “మైహెడ్—నాన్న తలకాయి” అంటూ చదవడం ప్రారంభించేడు. అప్పుడు ఆతని అన్న వచ్చి “మైహెడ్ అంటే నాన్న తలకాదురా! నా తలకాయి” అని చెప్పేడు. అప్పుడు అతడు “మైహెడ్—అన్న తలకాయి” అంటూ చదవడం ప్రారంభించేడు. ఆసమయమున ఆతని బావ వచ్చి “మైహెడ్ అంటే అన్న తలకాయి కాదోయీ! నాతలకాయి” అని చెప్పేడు. అప్పుడు కూడ ఆ అబ్బాయి “మైహెడ్—బావతలకాయి” అంటూ చదవడం ప్రారంభించేడు.

వాళ్ళందఱికి కోపము వచ్చి, ఆ అబ్బాయిని తన్నుటకు సిద్ధమయ్యేరు. ఇంతలో అతని తల్లి వచ్చి సంగతి కనుక్కుంది. “మైహెడ్ అంటే నీతలకాయిరా! అబ్బాయీ!” అని తలపట్టుకొని చూపించింది. అప్పుడతనికి మైహెడ్ అంటే బోధపడింది. అందఱూ నవ్వుకున్నారు.



# ఎన్ని రోజులు?

ఏయే నెలకు
ఎన్ని రోజులో
ఎరుగుదువా?
జనవరి మార్చి
మే జూలైలు
ఆగష్టక్టోబరును
డిసెంబరు
నెలలకు ముప్ఫయి
యొక్కొక రోజులు.
ఏప్రిల్ జూనూ
సెప్టెంబరు మరి
నవంబరునకు
ముప్ఫయి వంతున
జరుగుచు నుండు
ఫిబ్రవరునకు
ఇరువై ఎనిమిది
లీపియరులో
ఇరువై తొమ్మిది.

రచన : పోలాకి శ్రీనివాసరావు
(బూరవల్లి)

31 31 30 31 30 31

31 28 / 29 31 30 31 30



# అంకెల పద్యం

ఒకటీ—రెండు
పండని పండు

మూడూ—నాలుగు
తింటే మూలుగు

ఐదూ—ఆరూ
కొబ్బరి కోరు


ఏడూ—ఎనిమిది
లేతది నాది

తొమ్మిది—పది
ముదరది నీది

రచన : కానుకొలను

(అనంతపురం)






# పిల్లి--కోతి (కథ)

ఒక పిల్లి ఒక చెట్టుమీద ఒక కోతిని చూసింది. చూసి దానితో జట్టు కట్టుకుందామని దానిదగ్గరకు పోయింది.

కాని కోతి అందికదా "నేను శాఖాహారిని. అంటే పండ్లూ కాయలూ దుంపలూ తినేదాన్ని. నీవు మాంసాహారివి. రాకాసి వంటి నీకూ, మునీశ్వరుడు వంటి నాకూ ఎలా జతపడుతుంది?"

అందుకు పిల్లి "నేనేదితిన్నా నీవలే అడవిజంతువును కాను. మనుష్యులతో నాకూ నాతో మనుష్యులకూ దగ్గిర సంబంధం ఉంది...." అని ఇంకేదో చెప్పబోతూఉండగా కోతి "నీకేసంబంధమూ లేదు. నాకే ఉంది. నేనసలు ఆకారంలోనే మనుష్యుని పోలియున్నాను. మా అందాన్ని చూసి మనుష్యులు మమ్మల్ని మచ్చికచేసి సర్కసు కంపెనీల్లో ఆట సామాన్లుగా చేస్తారు. పిల్లిని తలపనైనా తలపరు."

పిల్లి:-కోతి బావా! నేను నీతో జట్టీకోసంరాలేదు. జట్టుకోసం ఒచ్చేను. జట్టు కుదరదంటే పోతాను.

కోతి:_అయ్యో పోవద్దు. ఏదో మాటవరుసకి అన్న మాటలకు ఉడుక్కుంటావా బావా? మనం గట్టి జట్టే కట్టుకోవాలి. తోకలు రెండూ గట్టిగా ముడిపెట్టుకుంటే మన జట్టు గట్టి పడుతుంది.

అవి రెండూ సరే అంటూ తోకలు గట్టిగా ముడి పెట్టుకున్నాయ్. అప్పుడు పిల్లి "నేను చక్కగా పాడగలను. నువ్వు నాట్యంచేస్తావా?" అంది కోతితో. కోతి, పిల్లిని పాడమంది. పిల్లిపాడుతూండగా అది నాట్యంచేస్తోంది.

ఇంతలో పిల్లికి ఒక చిట్టెలుక కనుపించగా అది చటాలున పరుగెత్తింది. పిల్లితోకకి కోతితోకకీ లంకెగనుక కోతికూడా కింద

దొర్లుకుంటూ వెళ్లింది. పాపం, కోతి ముక్కూ మొహమూ గీసుకు పోయినై. అది కిచకిచమని గోలచేస్తూ పిల్లి చెవిని కరవబోయింది.

కోతికి కోపంవచ్చింది. పిల్లితో "నీ జట్టు విప్పేస్తా" నంది.


"అది నా తప్పుగాదు, దొరక్కుండా పారిపోయిన చిట్టెలుకదే తప్పు" అంది పిల్లి. ఎలాగైనా జట్టు విప్పేసుకోవాలంది కోతి.

పిల్లి:— "అయితే మనం ఈ రైలు రోడ్డు వెంబడే వెళ్దాంపద"

కోతి:— "ఎందుకు?"

పిల్లి:— "ఈ రెండు పట్టాలు ఎక్కడ కలుసుకుంటాయో చూసి అక్కడ మనం మన జట్టు విప్పేసుకుందాం."

కోతి:— "సరే పద."




అవి అట్లు పోతూ వుండగా వెనకనుండి రైలింజను ఒస్తూ వుంది. కోతీ, పిల్లీ ఆ రైలింజనును బ్రతిమాలి దానిమీద కెక్కాయ్. రైలు పట్టాలు రెండూ కలుసుకున్నచోట అవి జట్టిప్పుకుంటాయిట. అవి జట్టు ఎప్పుడు విప్పుకుంటాయో నీకు తెలుసా బాలా?

రచన:
నాగవోలు వెంకట అప్పారావు.

# బడాయి బావ!

రచన: మాకేపల్లి సంగమేశ్వరకవి
(మచిలీపట్టణం)



మాచక్కనైన అక్కా
మందారు పూల ముక్కా
మాబావా బోసినోటితో
మాటాలాడే వరదునక్క!

ఎక్కాలు చదవమంటె
వెక్కి వెక్కి ఏడ్చునమ్మా
ముక్కు మొగమూ వక్క! పోదు గే
మూడు మొగముల చక్కనయ్యా!





చలిమిడంటే ఎంత ఇష్టమో
అలుగుతాడే కన్నబాబూ!
పలుగురాళ్లలాటి పళ్లు
పప్పుదాక వంటినోరు!

గూడకట్టు కట్టుకోని
కులికి సైకిల్ ఎక్కబోతే
కోడెదూడా బెదరితన్ని
పేడకడిపై పడగద్రోసె!





పెంచి పెంచీ తలకు క్రాపూ
పంచపాళీ దించినాడే
పంచపాళీ దించిగొప్ప
చెంచునాయకుడాయెనే!

# బావ అదృష్టం

చింకి గొంగళ్ళన్ని కట్టేటి బావకు
పట్టూ పీతాంబరము లమిరెనే
అక్కయ్య పుణ్యాన కలిగెనే
మిక్కిలి సౌభాగ్య మందెనే
మీనాక్షితో పొందు కలిగెనే ॥చి॥

కుండ మూకుట్లో భోంచేసే బావకు
వెండి కంచంగిన్నె లమిరేనే
మన అక్కయ్య పుణ్యాన కలిగేనే
మిక్కిలి సౌభాగ్య మందేనే
మీనాక్షితో పొందు కలిగేనే॥చి॥

నుక్క మంచంమీద కూలేటి
బావకు
పట్టెమంచం పరుపు లమిరేనే
అక్కయ్య పుణ్యాన కలిగేనే
మిక్కిలి సౌభాగ్య మందేనే
మీనాక్షితో పొందు కలిగేనే॥చి॥

రచన: కొల్లూరి లక్ష్మీరంగనాయకి
(ట్రిప్లికేను)



## పొట్టిబావ

బావగారూ! వచ్చారా!
బడాయిచేసుకు వచ్చారా!
సూటు బూటులూ వేశారా?
సీటు గోటుతో వచ్చారా?
పట్నంనుంచీ వచ్చారా?
పరీక్ష ఫేలై పోయూరా!
కాళ్లకు నీళ్లూ కావాలా!
కాఫీ టిఫినూ తేవాలా?
విరిగిన కుర్చీ వేయూలా?
చెరిగిన క్రాపూ దిద్దాలా?
అక్కను రమ్మని పిలవాలా?
హారతి పళ్లెం పట్టాలా?

రచన: "చిట్టి బాల" సోదరులు
(ఖర్గపురం)

**తెలుసా**

అమెరికాలో, బడులలో పిల్లలచేత నడపబడుచున్న పత్రికలు సుమారు 30,000 వున్నవట. అందులో కొన్ని దినపత్రికలు, కొన్ని వారపత్రికలు, పక్షపత్రికలు, మాసపత్రికలు కూడా వున్నాయి.

—యు. ఇ. సర్వీస్.

# నైజాం నైజం కథ

రచన : జలగం రామారావు (కేసరాపల్లి)

అనగా అనగా ఒక ఆంధ్ర బాల. ఆ బాల ఒకనాడు ఏడుస్తోంది.

బాలా! బాలా! ఎందుకేడుస్తున్నావు?

మా పంతులుగారు కొట్టారు.

పంతులుగారూ! పంతులుగారూ! ఎందుకు కొట్టారు?

బాలకి పాఠాలు రాలేదు.

పాఠాలూ! పాఠాలూ! బాలకి ఎందుకు రాలేదు?

చదువుతే కదా వస్తాయి.

బాలా! బాలా! ఎందుకు చదవలేదు?

లైటు లేకపోతే ఎలాగ చదివేది?

లైటూ! లైటూ! ఎందుకు వెలగలేదు?

కరెంటు లేదు.

కరెంటూ! కరెంటూ! నువ్వెందుకు రాలేదు?

ఎంత్రాలు తిరగలేదు.

ఎంత్రాలూ! ఎంత్రాలూ! ఎందుకు తిరగలేదు?

బొగ్గు సప్లయి లేదు.

బొగ్గూ! బొగ్గూ! ఎందుకు రాలేదు?

సింగరేణి గనుల్ని వెళ్లి అడుగు.

గనులూ! గనులూ! బొగ్గు ఎందుకు పంపలేదు?


వెళ్లి నైజాంని అడుగు.

నైజాం! నైజాం! బొగ్గు ఎందుకు పంపలేదు.

అది నా నైజం! నా ఇష్టం!



రచన : ఎ. అమ్మాజి (విజయనగరం)




రచన : నూరంపూడి భాస్కరరావు ఎం. ఏ.

ఎక్కడో దూరాన, నీలాకాశపు తీరాన ఒక కొండ ఉంది. ఆ కొండచుట్టూ ఆకు పచ్చని మైదానం ఉంది. మైదానం వెనక ఒక దట్టమైన అడవి ఉంది. ఆ అడవి కొసని ఒక యేరుంది. ఆ యేటి ఒడ్డున ఒక ఊరుంది. ఆ ఊరులో పది పూరి కొంపలూ పాతికమంది గొల్లకాపులూ ఉన్నారు. సుబ్బన్నకి యాభై గొఱ్ఱెలూ ఒక కూతురూ ఉన్నారు. కూతురు 12 ఏండ్లు. పేరు గోమతి.

గోమతి రోజూ ఉదయాన్నే లేచి చల్ది కుడిచేది. గబగబా గొఱ్ఱెల పాకలోకి పోయేది. గొఱ్ఱెలని విప్పేది. వాళ్ల బావ రత్తయ్య పాలుపితికిన తరువాత గొఱ్రెపిల్లలని విప్పేయడంవల్ల అప్పటికి అవి పాలు కుడుచుకుంటూ ఉండేవి. ఒక్కొక్క గొఱ్ఱెపిల్లనీ పేరుపెట్టి పిలుచుకుంటూ, గొఱ్ఱెలన్నిటినీ విప్పుకొని తోలుకుంటూ పోయేది.

గోమతికి ఆటలూ పాటలూ చాలా ఇష్టం. ఆడుకుంటూ పాడుకుంటూ గోమతి ముందు నడుస్తుంటే గొఱ్ఱెలన్నీ పరుగులెత్తుకుంటూ ఆమె వెనకాలే వచ్చేవి. గోమతి పాట పాడుతూంటే మామిడికొమ్మలు తలలూగించేవి. గోమతి పాడుతూ ఉంటే యెఱ్ఱటి సూర్యుడు మరింత యెఱ్ఱగా అయేవాడు. నేలమీద పచ్చిక అంగుళమెత్తు యెక్కువ పెరిగేది. మైదానం మధ్యనున్న కొండ నున్నగా అయిపోయేది. చుట్టూ ఉన్న చెట్లు దట్టంగా ఉన్నా

ఆమెకి కొంచమైనా భయంవేసేది కాదు. ఆమెకి ఒంటరిగా దూరంగా పోవడం ఇష్టం.

ప్రతి రోజూ ఉదయాన్నే ఆమె కొండ సమీపానికి చేరేది. ప్రతి రోజూ వచ్చేటప్పుడు పోయేటప్పుడు కూడా ఏదో ఒక పాట పాడుతూనే ఉండేది. అందుచేత ఆమె కొండ చుట్టు ప్రక్కల ఎక్కడెక్కడ ఏమేమి ఉందో అంతా యెరుగును.

ఒక రోజున గోమతి, ఆ యేటి ఒడ్డునుంచి ఆ చెట్ల మధ్యనుంచి గొఱ్ఱెలని తోలుకుంటూ పోతోంది. ఆమె ఒక పాట పాడుతోంది.

చల్లగ గాలులు వీచినవి
తెల్లగ మల్లెలు పూచినవి
మెల్లగ పక్షులు కూసినవి
అల్లదె సూర్యుడు ఉదయించె॥


పచ్చిక గొఱ్ఱెలకై మొలచె
పంటలు జనములకై పండె
దేవుడు స్వర్గములోనుండె
దేశము సౌఖ్యముతోనిండె॥

ఆ అమ్మాయి పాడడం మూలాన ఈ పాట ఎంతో బాగుంది. ఆకాశంమీద యెగురుతూపోయే గంధర్వకన్య యెవరో పాడుతోందా అనిపిస్తుంది ఆమె పాట గాలిలో అంత హాయిగా పొంగుతూంటే!

ఆ రోజు చాలా ముఖ్యమైన రోజు. ఎందుచేతనంటే చెట్లు పిట్టలూ ఉండే ఆ అడివి మాటుకి, ఆ కొండ వెనకకి ఆ వేళ యెవరో ఇద్దరు మనుష్యులొచ్చారు. వాళ్లు దొంగల్లాగా ఉన్నారు. వాళ్లు దొంగలే!

వాళ్లకి గోమతి పాట వినిపించింది. ఎవరో గంధర్వకన్యయే కాబోలనుకున్నారు. లేకపోతే కొండ అంతనున్నపడదు, సూర్యుడంత యెఱ్ఱపడడు. పచ్చిక అంత ఒత్తుగా పెరగదు. వాళ్ల మనస్సులు అంతగా తబ్బిబ్బుగావు.

వాళ్లు లేచారు. గంధర్వకన్య కళ్లకి కనబడదనుకున్నారు. అయినా ఆకాశంవంక చూచారు. కాని పాట ఆకాశంలోనించి వినబడడంలేదు. ఎక్కడో దూరాన నీలాకాశపు తీరాన వినిపిస్తుంది. ఊరిలో బయలుదేరింది. ఏటి ప్రక్కనించీ సాగింది. దట్టమైన చెట్లలో చొచ్చుకొంది. మైదానంలో నిండింది. కొండ శిఖరం




మీాది కెక్కింది. పాట అంతటా కమ్ముకుంది. అందుకే అన్ని దిక్కులూ వెతికారు వాళ్లు. అయినా గంధర్వ కన్య కనబడ లేదు వాళ్లకి.

వాళ్లకి చాలా ఆనందం కలిగింది. అలాటి ఆనందం యెప్పుడూ యెరగరు. వాళ్లు దొంగిలించిన వెయ్యి రూపాయల కన్న ఈ ఆనందమే యెంతో బాగుంది. అలాగే చూస్తూ ఉండి పోయారు.

పాట అంత కంతకు దట్టమైంది. పాట అంత కంతకు దగ్గరైంది. మెల్లిగా చల్లగా చెట్ల మధ్యనుంచీ ఒక అమ్మాయి కనపడింది. వెనక గొర్రెలు ఒక దాన్నొకటి సంతోషంగా బలంగా ఒత్తుకుంటూ, గెంతుకుంటూ వస్తున్నాయి. ఆమె పాట గాలిలాగా గాలిలో అలుముకుంటే, ఆ కెరటాలలో పక్షులు ఉయ్యాలలూగుతున్నాయి.

కొండ మీాదనుంచి దూకుతూన్న సెలయేరులా ఆమె పెదవుల సందునుంచి పాటవినిపిస్తోంది. గుడిలో గంటలా ఆ అమ్మాయి కంఠం మోగుతోంది.

దొంగ లెందుకో కలవర పడ్డారు. దొంగ లెందుకో గబగబా ముందుకి నడచారు.

డబ్బులు జారి పడిన చప్పుడు వారి చెవులకి వినిపించలేదు. వాళ్లకి కొంచం భయంవేసింది. వాళ్లకి దొంగతనం జ్ఞాపకం వచ్చింది. అంతకు ముందు వాళ్ల కడుపులో కదిలిన ఆకలి జ్ఞాపకం వచ్చింది. ఎదురుకుండా మామిడిచెట్లు కనిపించాయి. పళ్లు కోసుకుని తిని ఏటి జలం తాగితే ఆకలి తీరుతుందని తెలిసింది. వాళ్లిద్దరూ ఒకరి ముఖం ఒకరు చూచుకున్నారు. వాళ్లు మళ్లీ కొంచెం దూరం నడిచారు. మళ్లీ ఆకలి జ్ఞాపకం వచ్చింది. దొంగతనం జ్ఞాపకం వచ్చింది. రాజభటులు తమని వెతుకుతున్నారని, దొరికితే ప్రాణాలు తీసేస్తారని జ్ఞాపకం వచ్చింది. వాళ్లకి భయం వేసింది. ఒకళ్లకేసి ఒకళ్లు చూసుకున్నారు. మళ్లీ నాలుగడుగులు ముందుకు వేశారు. ఆ అమ్మాయి పరుగెత్తుతోంది. పాడుతోంది. హాయిగా ఉంది. ఆ అమ్మాయికి భయం లేదు. ఆకలిలేదు. ఆ అమ్మాయి దొంగతనం చేయలేదు. ఆ అమ్మాయిని చూస్తే వాళ్లకి అసూయకలిగింది. రెండు గొర్రెలని మేపుకుంటే దొంగతనం చెయ్యక్కర్లేదు కదా! అని తట్టింది. వాళ్లు ఆలోచించారు. తాముకూడా గోమతిలాగే ఆనందంగా ఉండాలని కోరుకున్నారు.



రచన : ఎ. అమ్మాజీ (విజయనగరం)

# భయం! భయం!! అంటే ఏమిటి?



రచన :
జె. కె. టి. స్వామి (గుత్తి)


బాలా !

పులి, సింహం, ఏనుగు, పాము, తేలు, మొదలయిన వాట్లను చూస్తే, నీవు జంకుదువు కదూ? ఎందుకు జంకాలి? వాటివల్ల నీకు ఏమి అపాయము కలుగుతుందోనని కదూ? సరే కాని ఎప్పుడయినా కుక్క గట్టిగా మొరిగినా, వర్షాలప్పుడు ఉరుము శబ్దము విన్నా నీవు ఉలిక్కి పడుదువు కదూ? ఇలాంటి జంకుకే భయం అంటారు.

ఈ 'భయం' అన్నది ఏమిటి? ఎలావుంటుంది? ఎక్కడ పుడుతుంది? మనం ఎందుకు భయపడుతాం? నీలాగే అందరూ భయపడవలసిందేనా? అని ఎప్పుడయినా యోచించావా? లేదనుకుంటా. దీన్ని గుఱించి నీవు ముఖ్యంగా తెలుసుకోవడమే కాకుండా నీతోకూడా ఆడి పాడి, చదువుకునే బాలలందరికి తప్పక చెప్పాలి.

మనం చూడలేని వస్తువుల్లో 'భయం' అనేది ఒకటి. దీన్ని తాకలేం. పట్టుకోలేం. కేవలం మనం దీన్ని అనుభవించగలం. ఇది మనలోనే పుడుతుంది. దీనిలాగే మనలోనే పుట్టి, మనం అనుభవించేవి సంతోషము, దుఃఖము, ఆశ్చర్యము మొదలయినవి మరికొన్ని. ఇది మనలో ఎలా పుడుతుందంటావా?

నీవు చిన్న శిశువుగా వున్న




ప్పుడు, అమ్మ, నాన్న, చెప్పినట్లు వినక నీవు మారాము చేస్తే, అదుగో బూచాడొచ్చాడు! ఇదో దొంగాడొచ్చాడని అంటూ నిన్ను భయపెట్టి, నిద్రపోనిచ్చి తమ పనులు చూచుకుంటారు. నీవు కాస్త పెరిగి పెద్ద అయి స్వతంత్రంగా తిరగడానికి ప్రారంభించి నప్పుడు, నీవు అలా యిష్టానుసారంగా తిరక్కుండా చెయ్యాలని, అక్కడ పులుందని, పాముందని, అవి పట్టుకు చంపుతాయని భయపెట్టి నిన్ను పోనివ్వకుండా చేస్తారు. ఇలాగే ఎండకు, చలికి, బయటికి పోవద్దని, వెళ్ళితే జబ్బులొస్తాయని భయపెడుతారు. ఇలా చేయటంచేత చిన్నప్పటిలోనే నీలో ఉన్నటువంటి, స్వాతంత్ర శక్తి, నిర్భయత్వం నశించి నీవు పిటికి పందవగుటకు అవకాశము ఏర్పడింది. అంచేతనే రాత్రిళ్ళు చీకటిలో వెళ్ళాలంటే భయం. బాగా గడ్డం పెరిగిన మనిషినిచూచినా భయం. కడకు అస్తమానం మన యింట్లో తిరిగే కుక్క, పిల్లిని చూస్తే భయం. మనం పెద్దవాళ్ళమయినా యీ భయం మనని వదల్దు.


పూర్వం శకుంతల కుమారుడు భరతుడు (తరువాత గొప్ప రాజు) అడవుల్లో ఆడుకొనేటప్పుడు వాడికి మిత్రులు, శత్రులు అంతా అడవిమృగాలేనట. కొంచమయినా 'భయం' లేకుండా వాటితో ఆడుకుంటూ, కుస్తీలు పడుతూ, వాటి నోళ్ళను చీల్చి పళ్ళు లెఖ్ఖ పెట్టేవాడట! భయమంటే ఏమిటో తెలియదు! అర్జునుని కుమారుడు అభిమన్యుడు కుఱ్ఱాడయినా నిర్భయంగా ఒక్కడే గొప్పవీరులతో యుద్ధం చేశాడట. అభిమన్యుని దెబ్బకు కౌరవ వీరులు హడలిపోయారు.. చూశారా, అభి

మనుష్యునికి యుద్ధమంటే ఎంత నిర్భయమో!

లవకుశులు, శ్రీరాముడు విడిచిన అశ్వమేధయాగపు గుఱ్ఱాన్ని ఆపి, తమ పిన తండ్రి అయిన భరతునితో యుద్ధం చేశారు.

మహారాష్ట్రవీరుడు శివాజీ తన బాల్యంలో తన గురువుకోసం పులి పాలు పితికి తెచ్చాడట. పులిని చూస్తేనే భయమవుతుందే పులిపాలు ఎలా తెచ్చాడో! వీరంతా నీలాంటి బాలలే అయినా నిర్భయులు కావటంచేత గొప్పకార్యములు చేయగలిగారు.

మన దేశానికుత్తరాన హిమాలయా పర్వతాలున్నాయని అవి చాలా ఎత్తయినవని, వాటిమీద ఎప్పుడూ మంచుగడ్డకట్టి ఉంటుందని, ఆ కొండ చివరిదాకా ఎవరు ఎన్ని సారులు ప్రయత్నించినా ఎక్కలేక చాలామంది చనిపోయారని నీవు పంతులుగారు చెప్పగా బళ్లో వినివుంటావుకదూ? అంత మాత్రంచేత ఇతరులు భయపడి మరల ఎక్కడానికి ప్రయత్నించడం మానుకున్నారా? లేదు. ఈ నాడుకూడా ప్రయత్నిస్తూనే ఉన్నారు.




విమానం కనిపెట్టటప్పుడు, ఆకాశంలోనుంచి ఎంతమంది క్రిందబడి చచ్చారో! ఎన్ని విమానాలు కూలిపోయినాయో! కాని, విమానాల్లో ప్రయాణాలు మానుకున్నారా? విమానాలు రోజూ ఆకాశంలో ఎగురుతూనే ఉన్నాయి. యుద్ధాల్లో విమానాలు విరివిగా ఉపయోగించారు. వేలకొద్దిజనం యుద్ధాల్లో చనిపోతున్నారు. పీనుగులు కుప్పతిప్పలుగా పడిఉంటాయి. కాని, సిపాయిలు వాటినిచూచి భయపడి యుద్ధం మానుతున్నారా? లేదు కదా!


'భయం' అన్నది చిన్నప్పటి

నుంచి అలవడిన గుణం అని తెలుసుకొన్నావు కదూ ? మనలో యీ భయం తొలగిపోవాలంటే ముఖ్యంగా తల్లి తండ్రులు, ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకోవాలి. వీరి శ్రద్ధ వల్లనే బాలలు పెరిగి పెద్దలై, వీరులై రాజ్యాలు పాలించారు. భయమన్నది నీలో ఉన్నట్టయితే చిన్న గడ్డిపోచకుకూడా నీవు భయపడుదువు. లేకపోతే పులినైనా ఎదిరించగలవు. నీ మనస్సులోనుంచి భయాన్ని పారదోలు. నిన్ను యీ ప్రపంచంలో ఏదికూడా భయపెట్టగలది ఉండదు.

బాల్యంనుంచి నీవు నిర్భయ గుణాలు అలవరచుకొని నేర్చుకొనకపోతే నీవు పెరిగి పెద్దవై ఆనందించగల నీ దేశ స్వాతంత్ర్యము నీకు దక్కదు సుమా!

# జీబ్రా (చారల గుర్రాలు)

మమ్మల్ని "జీబ్రా" లంటారు. మీరు మమ్మల్ని "చారల గుర్రాలు" అని పిలవవచ్చును. ఎందుకంటే మా ఒంటిమీద చారలు వుంటాయి. మేము గుర్రం జాతికి, గాడిదజాతికి చెందుతాము. మేము సాధారణంగా అడవుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతాము.



మేము ఆరుగురము ఒక జట్టు. కాని మా జట్టుకి చెందని ఇంకొక జీబ్రా మాలోకలిసిపోయింది! ఏదీ ఆ జీబ్రాని మీరు పోల్చుకొని దానిని విడదీయండి చూద్దాం.

# మాటలు నేర్చుకో

బాలా!

ఇదుగో ఈ నెల ఇంకొక వరుస మాటలు, మధ్యన "రు" వచ్చేవి ఇచ్చాను. మాటల అర్థాలు వాటిఎదురుగా వున్నాయి. ఏదీ ఆమాటలు పూర్తిచెయ్యి చూద్దాం.

1 — రు — : మేఘాల్లోవుండే జిగేల్ దీపం

2 — రు — : పాలు తోడుపెడితే ఇదిఅవుతుంది

3 — రు — : రహస్య ప్రదేశం

4 — రు — : దీనిపై కూర్చుంటాం.

5 — రు — : ఇదిపెట్టితే బంగారం తళతళలాడుతుంది.

6 — రు — : దీనిపై పడుకుంటాం

7 — రు — : గొంతు

8 — రు — : మనము పళ్లతో యీపనిచేస్తాము

9 — రు — : సబ్బురాసుకుంటే ఇదివస్తుంది.

10 — రు — : ఇదివస్తే వర్తకులకు నష్టం.

11 — రు — : యుద్ధంలో జయంపొందేవాడు

12 — రు — : ఇతరులు

13 — రు — : మనిషి

14 — రు — : దేశంలో ఇదివుండకూడదు

15 — రు — : విద్యచెప్పువాడు


16 — రు — : పంటలకు ఉపయోగిస్తారు.

17 — రు — : ఇందులో నీళ్లువుంటాయి.


18 — రు — : కనికరము.


కూర్పు: దూర్వాసుల వెంకటరత్నం (విశాఖపట్టణం)

# పొట్టివాడికి పుట్టెడు బుద్ధులు




పొట్టివాడికి పుట్టెడు బుద్ధులు. ఇదుగో చూడు ఈ పొట్టివాడు కుడిచేత్తో కత్తెర పట్టుకొన్నాడు. నల్లటి కాగితం తెచ్చాడు. ఆ కాగితంలోనుంచి వంకరటింకరగా ఒక కాగితం ముక్క కత్తిరించాడు. తరువాత జిగురు సీసా తెచ్చి ఆ కాగితం ముక్కకి జిగురు రాశాడు. కిటికీ అద్దానికి ఆ నల్లటి కాగితం ముక్కని అంటించాడు. ఏమీ ఎరగనట్టు మన పొట్టివాడు ఆ కిటికీ దగ్గరే నిలుచొని రబ్బరు బంతి ఆడుతున్నాడు.



ఇంతలో నాన్న వచ్చాడు. కిటికీ అద్దం వేపు చూచాడు. తెల్లటి అద్దం మధ్య నల్లగా వుండడం చూచాడు! "అయ్యో! అద్దం ముక్క విరిచేశావా!" అని పొట్టివాడిని కోప్పడ్డాడు.



"లేదు నాన్నా! ఇది కాగితం ముక్క. నిన్ను గమ్మత్తు చేయడానికి అలా అంటించాను" అన్నాడు పొట్టివాడు!



# పొడుపుకథలు

## 1

ఒంటి కాలివాడు లావంటి తలకాయ
ఆకులన్ని మేయు మేకకాదు
రాజుల సభలోన రంజిల్లు చుండును
దీనిభావమేమి తెనుగుబాల ?

## 2

నభీజం పూర్ణ వృక్షం
శాఖా పల్లవ వర్జితం
పుష్పం నాస్తి ఫలం నాస్తి
కిం వృక్షం పండితోత్తమా ?

(దీని అర్థం: విత్తనంలేని పూర్తి చెట్టు, కొమ్మలు లేవు, పలవలు లేవు; పువ్వులుగాని పండ్లుగాని కాయదు. ఆ వృక్షమేమో చెప్పగలవా బాల పండితుడా?)

సంపాదన : బి. సూర్య ప్రకాశరావు (నిడదవోలు)

## 3

ఉక్క కోర్వలేక చెక్కిళ్లు చెమటార
ముక్కు లేనిపండు చెక్కుదీసి
ముక్క ముక్కకోసి చక్కెర కలబోసి
ఒక్క పిల్లవాడు మెక్కినాడు ?

సంపాదన : వె. వినత

## 4

జేబులో తానుంటే ఇంకొకరిని ఉండనీయడు....ఎవరు ?

సంపాదన: టి. ఆర్. జాన్. (సామర్లకోట)    జవాబులు ఈసంచికలోనే

# కట్టు కథల పుట్ట...

రచన : కర్రా సూర్యనారాయణ శాస్త్రి

## "దయ్యాల మఱ్ఱిక్రింద దొంగల రాజ్యం"

[జరిగిన కథ: కట్టుగాడు తండ్రితో దెబ్బలాడి, ఇల్లువదలి పారిపోయాడు. తోవలో ఒక పిసనారిదానిని మోసగించి ధనం సంచులు ఎత్తుకొని పారిపోతాడు. ఆ సంచులు ఒక గాడిదమీద పెట్టితే ఆ గాడిద దౌడుతీసి పారిపోయింది. ఆఖరికి కట్టుగాడి చేతిలో ఒక్క రూపాయి మాత్రం మిగిలింది. ఆ రూపాయితో పిచ్చమ్మ అనే పేదరాసి పెద్దమ్మని మోసగించి మళ్లీ ధనం మూటలు సంపాదించి పారిపోయాడు. ఇక చదవండి—

సం॥]

అనగా అనగా ఓ పెద్ద అడివి ఉంది. అడివి నిండా ఏనుగులూ పెద్ద పులులూ సింహాలూ చాలా ఉన్నాయి. అంతా చీకటి కొట్టుగా ఉంటుంది. పట్ట పగలే అందులోకి ఎవరూ వెళ్లలేరు. అది 5 మైళ్ల పొడుగుంది. ఆ అడివికి ఈ ప్రక్కా ఆ ప్రక్కా చాలా ఊళ్లున్నాయి. ఈ ప్రక్క ఊళ్లనుంచి ఆ ప్రక్క ఊళ్లకు వెళ్లాలంటే అడివిలోంచే వెళ్లాలి. ఇంకో దారి లేదు. ఆ అడివిలో కూడా ఒక్కటే కాలిదారి ఉంది. బండ్లు గిండ్లు ఏమీ వెళ్లవు. ఆ దారిలో ఓ చోట దయ్యాల మఱ్ఱి, అని ఓ పెద్ద మఱ్ఱి చెట్టుంది. దానిమీద దయ్యాలూ భూతాలూ చాలా ఉన్నాయంటారు. చెట్టుమీద దయ్యాలకేం గాని చెట్టుక్రింద దయ్యాల్లాంటి దొంగలుంటారు. ఆ దారిలోంచి ఎవళ్లైనా వస్తూంటే చాలు వాళ్లని చితకొట్టేసి వాళ్లదగ్గరుండే డబ్బు లాగేస్తూండేవాళ్లు దొంగలు. అందుచేత ఎవళ్లకైనా సరే అల్లా వెళ్లటమంటే చాలా భయం. తప్పనిసరి అయిన వాళ్లు మాత్రం జట్టు జట్టులుగా కలిసి వెడుతూంటారు.

ఒక రోజున పగలు తొమ్మిది గంటలవుతుంది. ఎవరైనా వస్తారా వాళ్లదగ్గరున్న డబ్బూ దస్కమూ లాగేద్దామా అని కొంతమంది దొంగలు మఱ్ఱిచెట్టు క్రింద కూర్చున్నారు. ఇద్దరు దొంగలు మఱ్ఱిచివరి కొమ్మకి ఎక్కి


ఎవరైనా వస్తున్నారేమో అని చూస్తున్నారు. చూస్తూచూస్తూ అందులో ఓ దొంగ "ఒరే! యీరా! ఇయ్యాల మన పున్నెం పుచ్చిందిరా! అదుగో ఆ పొడుగు తాడికాడ చూడ్రా! ఎవరో పల్లకీ యెక్కి వొత్తున్నారురా!" అన్నాడు. రెండో వాడు చూసాడు. చంకలెగరేసుకుంటూ ఇద్దరూ గబగబా కోతుల్లాగ దిగొచ్చారు. తిన్నగా దొంగల నాయకుడిదగ్గర కెళ్లి "దొరా! దచ్చినం వేపునుంచి యెవరో సవారీమీద వొత్తుంటారు. యేరో మారాజుల్లాగున్నారు. వంకతాడి దగ్గరకొచ్చేసారు" అన్నాడు. వెంటనే ఆ నాయకుడు పెద్ద సంతోషంతో అందరికీ ఏవేవో సంజ్ఞలుచేసాడు. అందరూ తలోచోటా దాంకున్నారు.

ఓం ఓం, ఓం ఓం అంటూ ఆరుగురు బోయీలు పల్లకీ మోసుకొస్తున్నారు. చాలా బరువుగా ఉందేమో మధ్య మధ్యన దింపుకుంటున్నారు. దయ్యాల మఱ్ఱిదగ్గర కొస్తున్నకొద్దీ దొంగల భయం ఎక్కువౌతోంది. అయినా తగలేకదా ఆరుగురున్నాంకదా! అనే ధైర్యంతో వచ్చేస్తున్నారు. సరిగ్గా దయ్యాలమఱ్ఱి క్రిందకొచ్చేసరికి "ఏయ్! ఆగండి!" అని ఉరుముల్లాంటి మాటలు వినిపించాయి. ఆ మాటలు వినేసరికి వాళ్లకి గుండెల్లో రాయిపడిపోయింది. చచ్చాంరా దేవుడా! అని పల్లకీ దింపి పైకి చూసారు.

చూసేసరికీ, బొబ్బర్లంక రేవులో నిద్రగన్నేరి చెట్లమీద పళ్లిగిలిస్తూ కూర్చున్న కొండముచ్చుల్లాగ నల్లటి మొగాలూ, కోరల్లాంటి పళ్లూ, చింతనిప్పుల్లాంటి కళ్లూ తాటి ఏనుగుల్లాంటి మనుష్యులు కొంతమంది కనుపించారు. వాళ్లు మనుష్యులో, దయ్యాలో, పిశాచాలో, ఏమీ తెలియక ఈ బోయీలందరూ వాళ్లని చూసిన వెంటనే ఒక్క దండం పెట్టి ఒక్కటే పరుగు పెట్టారు వెనక్కి. పల్లకీ చెట్టుక్రిందే వదిలేసి పోయారు. అందులో ఎవరున్నారో కాని తలుపులుమాత్రం అల్లాగే మూసి ఉన్నాయి. దొంగలు చెట్లుదిగి పల్లకీ దగ్గరికి వచ్చారు. చూస్తే తలుపులు లోపల వేసిఉన్నాయి. "ఏయ్! లోపలెవరూ! తలుపు తీయ్!"

అన్నాడొకడు తలుపుని తన్ను తూను. వాడు మామూలుగానే తన్నినా అది రఫీలుమని బ్రద్దలై పోయింది! ఆ లోపల ఎవరో ఒక మనిషి నిద్ర పోతున్నాడు. ఓ దొంగ నిద్రపోతోన్న వాణ్ణి ఒక్క తన్ను తన్ని ఏయ్! ఎవర్నువ్వు! అన్నాడు.

బాలా! వాడెవరో నువ్వేరుగుదువా? కట్టుగాడా? ఇంకేం! వాడు మన కట్టుగాడే! వాడు నిజంగా నిద్రపోతున్నాడా? లేదు! ఈ దొంగల్ని ఎల్లాగరా పట్టి కొట్టించడం! అంటూ ఆలోచిస్తున్నాడు. దొంగ తన్నడంతోటే కళ్లువిప్పి చూసాడు. ఆనాడు గుళ్లో కొచ్చిన దొంగలే కనిపించారు రాక్షసుల్లాగ. సరే! ఇంక పడుకుంటే లాభంలేదని ఆవలింత పెడుతూ వళ్లువిరుచుకుంటూ లేచి కూచున్నాడు. వాళ్లకేసి ఏదో ఆలోచనతో చూస్తూన్నాడు. అల్లాచూసి, చూసి, ఒక్కనూటు "ఏమయ్యా! నిన్నా మొన్నా దేవుడు గుళ్లోకొచ్చిన దొంగలు మీరేనా!" అన్నాడు. ఇదేమిట్రా మనల్ని చూసికూడా వీడింత ధైర్యంగా మాట్లాడుతున్నాడు



ఒక్కడుండి కూడాను. అనుకుని ఆ దొంగలు "ఉ! మే మే! యేం?" అన్నారు. "మీ నాయకుణ్ణి ఇల్లా పిలవండి!" అన్నాడు కట్టుగాడు. ఇదెక్కడి మనిషిరా వీడు మన్నేదో అధికారం చేస్తున్నాడు. అనుకుంటూ వాళ్లల్లోంచి నాయకుడు ఇవతలకు వచ్చాడు.

ఆపడంగా మన కట్టుగాడు "నువ్వేనా నాయకుడవు? ఏం తెలివి తేటలోయ్ నీవి. ఎంతో కష్టపడి చెమటోడ్చి సంపాదించిన డబ్బంతా ఆ పిచ్చెమ్మ మొగాన్న పోసి వచ్చేస్తారూ! సంపాదించిన డబ్బు జాగ్రత్త చేసుకోలేనప్పుడు ఆ సంపాదించడ మెందుకు? మళ్లీ దొంగలకందరికీ నాయకుడివి కదా! ఇదేటయ్యా నీగొప్పతనం! దొంగతనంలో ఎంత నేర్పుండాలి! ఎంత ధైర్యముండాలి, ఎంత సాహసముండాలి, ప్రాణం పోయే పరిస్థితి వచ్చినాసరే డబ్బు విడిచి పెట్టడమే! తీసుకో! ఇదిగో నీడబ్బు! మొదటిరోజున దేవుడుకని చెప్పి పెద్దమ్మకిచ్చిన డబ్బు ఈ పెట్టెలో ఉంది. రెండోరోజున గుళ్లో మీరు వదలివేసిన డబ్బూ నగలూ ఈ పెట్టెల్లో ఉన్నాయి. ఈమూటలూ ఇవన్నీ మీవే!" అని పల్లకీ లోంచి రెండు మూటలూ మూడు పెట్టెలూ ఇవతల పారేసాడు. గలగల మంటూ రత్నాలూ హారాలూ, రూపాయిలు ఇవతల పడుతూంటే దొంగలు చూచి డంగైపోయారు. వీడెవడో మనిషి కాడురా బాబూ! ఆ దేవుడే ఇల్లా వచ్చాడ్రా నాయనా! అనుక్కుని వాళ్లందరూ అమాంతంగా బుద్ధి బుద్ధి దేవుడా అంటూ లెంపలు వాయించుకుని "స్వామీ! రచ్చించండి బాబూ! మీ రెవరో సెల వివ్వాలి" అంటూ కట్టుగాడి కాళ్లమీద పడ్డారు.

"ఓరి పుల్లాయిల్లారా! నేనెవ ర్నేమిట్రా! నేనూ మీ మనిషినే! ఆ పిచ్చెమ్మ ఇంట్లో ఉండేవాణ్ణి. మొన్నటిరోజున మీరు దేవుడుకని గుళ్లో పారేసిన డబ్బంతా పిచ్చెమ్మ తెచ్చుకుని నాకు చూపించి సంగతంతా చెప్పింది. అరెరే! ఆ దొంగలెంత కష్టపడి సంపాదించారో!! ఈ పెద్దమ్మ ఏమీ కష్టంలేకుండా ఇదంతా లాగేసింది. ఇదెల్లాగయినా వాళ్ల కిచ్చెయ్యాలి, అనుకున్నా. మర్నాడురాత్రి మళ్లీ గుళ్లోకి తయారయింది. అప్పుడు

నేను వాసింట్లో ఉన్న డబ్బూ దస్కం అన్నీ జాగ్రత్త చేసి పెట్టెల్లో పెట్టి మీరు గుళ్లో ఉంటారేమో ఇచ్చేదామని దొడ్డిదారిని గుళ్లోకివచ్చాను. నే వచ్చేసరికి మీరెవరూ లేరుకదా! ఆపిచ్చమ్మ అక్కడ చచ్చి పడిఉంది దెయ్యంలాగ. చుట్టూ ఈనగలూ డబ్బూ ఇవీ ఉన్నాయి. ఓరి దీనితస్సాగొయ్యా ఈ పిచ్చెమ్మ దొంగల్నెదో భయపెట్టి ఈ డబ్బుకూడా లాగేసింది! ఇది చస్తే చచ్చింది కాని పాపం ఆదొంగలేమయ్యారో ఈ డబ్బంతా ఎక్కడెందు కొదిలెయ్యటం, ఇదికూడా వాళ్ళకెల్లాగైనా చేర్చెయ్యాలి, అని ఆ డబ్బంతా జాగ్రత్తచేసి మిమ్మల్ని వాకబు చేసుకుంటూ మీరీ అడవిలో ఉంటారని తెలిస్తే ఇక్కడికి వచ్చాను. నేవచ్చినపని అయిపోయింది. తీసుకోండి! ఈ డబ్బంతా మీదే! ఇంకెపుడూ ఇల్లాంటి తెలివితక్కువ పనులు చెయ్యకండి! అంటూ పెద్దలెక్చరు దంచేసి లేచాడు మనకట్టుగాడు. వాళ్లంతా పెద్ద ఆనందంతో "బాబూ! నువ్వు మహా బుద్ధిమంతుడివిలాగున్నావు, నాలుగు రోజులపాటు మా రాజ్యంలో ఉండునాయనా! అని బ్రతిమాలుకున్నారు. మీ రాజ్యమెక్కడ? అన్నాడు కట్టుగాడు. ఇదిగో బాబూ! ఈమఱ్ఱికిందే మారాజ్యముంది, బలే బలే తమాషాలున్నాయి! అవన్నీ చూసి వెడుదువుగానిలే! అని వేడుకున్నారా దొంగలు. సరేఅయితే! అల్లాగేలెండి, అని వాళ్లతో బయలుదేరాడు కట్టుగాడు.

బాలా! ఆ దొంగల రాజ్యం ఎల్లాగుంటుందో, ఏమేమి విశేషాలుంటాయో, నీకూడా చూడాలని సరదాగా ఉందా! ఉంటే మిఠాయి బాల కొనుక్కో.

## కప్పకు సంపంగినూనె కావలెనంటే!

బాలా! ఈచిత్రం ఎప్పుడైనా ఎక్కడైనాచూచావా? కప్పకు సంపంగినూనె కావాలట! మనుష్యులు సంపంగినూనె ఉపయోగిస్తారు కాని, కప్పకెందుకూ? అయితే ఈ సమస్య ఎలా తీర్చడం? ఈ సంచిక ఆఖరుపేజీలలో పద్యంచదువు. నీకే తెలుస్తుంది.

సంపాదన: కేశవులు, రాఘవులు (గిరింపేట)

# అబూబెనేడం

అనుసరణ: బులుసువారబ్బాయ్



అనగా అనగా ఒక్కప్పుడు
అబూబెనేడం అని ఒకడు
ఉండేవాడొక ఊళ్లోన.
ఒకరాత్రేమిటి జరిగిందంటే
అతడికి ఒక కల వచ్చిందంట.
కనబడె నతడికి కల్లోన
అందమైన ఒక అప్సరస.
"దేవీ, దేవీ, ఏంచేస్తున్నావ్
ఏం మాఇంటికి వేంచేశావ్
పావనమైందిక మా ఇల్లు
ధగ ధగ మెరసే బంగరుకలముతో
వ్రాసేదేమిటో తెలుపుదువా" అని



అడిగేడాబూ ఆత్రతతో.
"ఏమీ వింతయె కాదిది మనిషీ
దేవుణ్ణెందరు ప్రేమిస్తారో వా
రందరి పేర్లూ వ్రాస్తున్నా" నని
జవాబునిచ్చిం దప్సరస.
"ఉందా నాపేరందులో దేవీ?
తోడిమానవుల ప్రేమించే వా
రందరి పేర్లతో కలుపుము నన్ను"
అని ప్రార్థించా డాబూ; దేవిని.
మళ్లీ మర్నాడొచ్చిందప్సర.
చూపెను ఆబూ కా పేర్లన్ని.
ఆశ్చర్యంగా పేర్లన్నిటిలోన
మొదటిపేరు మన ఆబూదే!
తోడిమానవులదయతో చూడుము
పరులకష్టములు నీవిగ యెంచుము
మానవసేవే మాధవసేవ
ఇదియే నీతీ కథలో బాలా.

# ఆటల పండుగ
# ఆటల వివరములు

[బాలా! నీకు ఆటలంటే సరదాకదూ? అందులో కొత్త ఆటలంటే బలే సరదా. ఇదుగో కాకినాడ బడిలో ఈమధ్యనే పిల్లలు ఆడిన ఆటలు కొన్ని. —సం॥]

రచన:
రామడుగుల సూర్యనారాయణమూర్తి
(వ్యాయామ విద్యా అధ్యాపకుడు
పి.ఆర్. కాలేజిస్కూలు, కాకినాడ.)

వ్యాయామ విద్యాశాఖాధికారులైన శ్రీ రుద్రరాజు వెంకట సత్యనారాయణ రాజుగారి సలహాల ననుసరించి ప్రాథమిక పాఠశాలలోని బాలురను, వారి శక్తులను, ఎత్తులను, వారు చదువు తరగతులను, అనుసరించి కొన్ని తరహాలు (జట్టులు)గా విభజించి వాటికి కొన్ని పేర్లు పెట్టబడినవి. ఈ పేర్లు బాలుర యుత్సాహమును పెంపొందించుటకై పెట్టబడినవి. ఆ యా తరహాలకు అనుకూలమైన ఆటలను శ్రీ సత్యనారాయణ రాజుగారు ప్రదర్శించి చూపిరి. అప్పుడు నేను ఆ యాటల నాడించు విధానమును విపులముగా వ్రాసి శ్రీ రాజుగారికి చూపి, వారి సలహాల ననుసరించి కొన్ని సవరణలను చేసితిని.

జట్ల వివరములు:—

## 1 పువ్వుల జట్లు

ఇందు సామాన్యముగా 1, 2 తరగతుల బాలురు గలరు. ఇందు 3 అ 4 అం మొదలు 3 అ 9 అం॥ ఎత్తు వరకు గల బాలురు గలరు. ఇందు ప్రతి జట్టునకు వేర్వేరు పేర్లు ఈయబడినవి. ఉ॥ గులాబి, చేమంతి మొదలైనవి.

## 2 పక్షుల జట్లు

ఇందు 2, 3 తరగతుల బాలురు గలరు. వీరి యెత్తు 3 అ 9 అం॥ మొదలు 4 అ 2 అం॥

వరకు గలదు. వీరి జట్ల పేర్లు హంస, కోడి పుంజు మొ॥ నవి.

### 3 జంతువు జట్లు

ఇందు 3, 4 తరగతుల బాలురు గలరు. వీరి యెత్తు 4 అ 2 అం॥ మొదలు 4 అ 6 అం॥ వరకు గలదు. సింహము, పెద్ద పులి మొదలైనవి ఈ జట్ల పేర్లు.

### 4 యుద్ధ పరికరముల జట్లు

ఇందు 5, 6, 7 తరగతులలోని బాలురు గలరు. వీరియెత్తు 4 అ 6 అం॥ మొదలు 5 అ॥ ఎత్తు వరకు గలదు. బాంబులు, టాంకులు మొదలైన పేర్లు ఈ జట్లకు ఈయబడినవి.

ఈ ఆటల పండుగలో ఒకే రకపు బాలికల జట్లుగూడ పాల్గొన్నారు. వారి ఆటలు వేరు.

మొదట పువ్వుల జట్టునకు అనుకూలమైన కొన్ని ఆటలను, వాటి నాడించు విధానమును ఈ క్రింద పొందుపఱచితిని.

### 1 గూడ్సు ఇంజను

బాలురు వృత్తాకారములో కుడి వైపునకు తిరిగి యుందురు. ఈల వేయగానే వారు క్రుంగి, చేతులను ముందునకుచాచి, 'కూ' యని ఇంజను కూతను కూసి, రెండు చేతులను ఒకే పర్యాయము వెనుకకు లాగుకొని ముందునకు చాచుచు 'జుఫ్,



జుఫ్' అను శబ్దమును చేయుచు నెమ్మదిగా ముందునకు నడువవలెను. అట్లు చేయునప్పుడు పైకి లేవరాదు. తిరుగ ఈల వేయగానే బాలురు వృత్తాకారములో నిలబడవలెను.

### 2 మెయిలు ఇంజను

పై విధముగ బాలురు వృత్తాకారములోనుండి ఈల వేయ

గానే క్రుంగి, చేతులను ముందు వరకు చాచి, 'కో' యను కూత కూసి, రెండు చేతులను ఒకే పర్యాయము ముందునకు చాచుట, వెనుకకు లాగుకొనుట వేగముగా చేయుచు, 'జుప్, జుప్, జుప్' అను శబ్దములను వేగముగా అనుట, నెమ్మదిగా నడచుటకు బదులు వేగముగా నడచుట మొదలగు మార్పులతో అనుసరించి తిరుగ ఈల వేయగానే బాలురు వృత్తాకారములో నిలబడవలెను.

## 3 బాతు నడక

బాలురు పైవిధముగానే వృత్తాకారములోనుండి ఈల వేయగానే



కాలి మడమలు పైకెత్తి, రెండు చేతులను నడుమునకు చేర్చి కూర్చుని బాతుచేయు శబ్దము 'క్వాక్ క్వాక్' అను శబ్దమును చేయుచు ముందునకు నడువవలెను. అట్లు చేయునప్పుడు నడుము రెక్కలుకూడ స్వల్పముగా కదల్పవలెను. తిరుగ ఈల వేయగానే బాలురులేచి వృత్తాకారములో నిలబడవలెను.

## 4 సైకిలు త్రొక్కుట

బాలురు వృత్తాకారములోనుండి ఈల వేయగానే చేతులను ముందునకుచాచి, వ్రేళ్ళను



ముడిచి యుంచవలెను. సైకిలు త్రొక్కు రీతిగా మోకాళ్ళను పైకి యెత్తి దించుచు ముందునకు పోవుచు మధ్య మధ్య గంట కొట్టునట్లు బొటన వ్రేలును కదల్పుచు, నోటితో 'టింగు' 'టింగు'


అను శబ్దమును చేయవలెను. బాలురు ఎదుటి వైపునకే చూచుచుండవలెను. చేతులను మొదట ఏరీతిగా యుంచితిరో అట్లే యుంచవలెను. తిరుగ ఈల వేయగానే వృత్తములో యథాప్రకారముగా నిలువవలెను.

## ముక్కు—తాకుడు



బాలురలో నొకని కోతిగా నియమించవలెను. తక్కిన బాలురు వారి నియమిత స్థలములో పరుగెత్తుచు, కోతి వారిని తాకుటకు వచ్చినప్పుడు కాలిని పైకి యెత్తి, దాని క్రిందనుండి చేయిపెట్టి వంగి ముక్కును పట్టుకొనవలెను. అట్లు చేయని యెడల ఆ బాలుడు కోతి తాకుటవలన, కోతి యగును. ఇది వరలో కోతిగా నున్న బాలుడు బాలురతో కలసి పోవును. అట్లు కోతియైన వానికి 1 లేక 2 గుంజీలు తీయించి శిక్ష విధింప వలెను.

(ఒచ్చేనెల మిఠాయి సంచికలో ఇంకా కొన్ని ఆటలు వుంటాయి.)



తాబేలు పాపయ్య

# అడవి పిల్ల కథ

రచన: నాగవోలు వెంకట అప్పారావు

## 1-వ భాగం

అనగా అనగా ఒక రాజు. అతని పేరు జగపతి రాజు. అతడు చాలా మంచివాడు. ఒక మునీశ్వరుడు ఆతని మంచి గుణాలకుమెచ్చి అతనికి ఒక చిలుకను ఇచ్చాడు. అది అన్ని చిలుకల వలె సామాన్యమైనది గాదు. దానికి మనుష్యులభాష, జంతువులభాషకూడా వచ్చును.

రాజు సంతోషించి ఆ చిలుకను తన చిన్నారి చిట్టి కూతురు ఇందుబాలకు యిచ్చాడు. ఆ బాలకు ఆ చిలుక పిట్ట అంటే పంచప్రాణాలూను.

ఇట్లుండగా కొంత కాలానికి ఇందుబాలకు పెళ్లి యీడు వచ్చింది. ఆమె చక్కదనం చెప్పతరంకాదు. చాలా మంది రాజకుమారులు ఆమెను భార్యగా చేసుకోవాలని ఆశపడుతున్నారు. కాని ఇందుబాల తన అందానికి తగిన రాజకుమారుడు దొరికి నప్పుడే పెండ్లి చేసుకుంటాను అని అంటూ వుండేది.

ఉదయార్కుడనే యువరాజు ఇందుబాలకు తగినవాడు అని చిలుక నచ్చచెప్పింది. తుదకు అతడే ఆమెకు భర్త అయాడు.

ఇందుబాల అంటే ఉదయార్కునకూ, ఉదయార్కుడంటే ఇందుబాలకూ తమ ప్రాణంకన్నా ఎక్కువ తీపి. పెండ్లి ఐన తరువాత ఉదయార్కుడు కొంతకాలం అత్తవారి ఇంటనే యుండి ఇందుబాలను వదల్లేక వదల్లేక వదలి కొద్దిరోజుల్లోనే వస్తానని చెప్పి తన కోటకు పోయాడు.

ఇందుబాలను పెళ్లి చేసుకోవాలని ఆశించిన వాళ్లలో మదన మోహనుడను రాజకుమారుడు ఒకడు. అతడు దుర్మార్గుడై ఇందుబాలకు సౌఖ్యం లేకుండా చేదామను చెడు తలంపుతో ఉన్నాడు. అతనిది ద్రాచుపగ. సమయంకోసం ఎదురు చూస్తున్నాడు.

ఉదయార్కుడు తన కోటకు వచ్చి ఎన్ని రోజులో కాలేదు. కాని తన మనస్సు అంతా ఇందుబాల మీదే యుండడాన్ని అతనికి యెంతో కాలంవలెయుంది. రేపో మాపో బయలు దేరుదామా అనుకుంటున్నాడు.

ఇంతలో ఇందుబాల చిలుక వచ్చి అతని ముందర వాలింది. "రామ చిలుక! రామ చిలుక!" పెండ్లికూతురు బాగుందా? మా రాజు మామయ్యా రాణీ అత్తయ్యా కులాసాగా యున్నారా? వింత లేమిటి? అంటూ తొందర తొందరగా అడుగుతూ యుంటే పకపక నవ్వుతూ చిలుక యిట్లు పలికింది.

"బావగారూ! ఇన్ని ప్రశ్నలకు ఒక్కసారిగానే నెట్లు జబాబు చెప్పగలను? అందరికీ క్షేమమే కాని మా అక్క యిందుబాల మాత్రం చిక్కి సగమైపోయింది. మీరు రాలేదన్న విచారంతో మంచి నీరు కూడ త్రాగదు. మిమ్ములను రమ్మనమని నన్ను పంపింది." అనగా రాజకుమారుడు "సరిసరి! వేకువనే బయలుదేరుచున్నానని చెప్పు" అని ఆచిలుకను సత్కరించి పంపేడు.

అతనికి ఆ రాత్రి నిద్దుర రాలేదు. ఎప్పుడు తెల్లవారుతుందా? ఎప్పుడు బయలుదేరుతానా? ఇదే ధ్యానంతో ఇందుబాలను గురించి ఏమేమో ఆలోచిస్తూ ఉండగానే కోడి కూసింది. లేస్తు ఉండగా ఎడమ కన్ను అదరింది. ఐనా లక్ష్యపెట్టకుండా తన గుర్రాన్ని ఎక్కి బయలు దేరాడు.

ఇక్కడ చిలుక వలన అతడు వచ్చుచున్న సంగతి విని ఇందుబాల సంతోషంతో పొంగిపోయింది. ఆ సాయంత్రం వరకూ అలంకరించుకుంటూనేయుంది నిలువుటద్దం ముందర. కాని ఆ సాయంకాలానికే చేరుకోవలసిన ఉదయార్కుడు ఆ రాత్రికైనా చేరుకోలేదు!

చీమ చిటుక్కుమంటే ఉదయార్కుడే అన్నతహతహ కొద్దీ తెల్లవార్లూ జాగరం ఐపోయింది ఇందుబాలకు. ఉదయార్కుడు రాలేదు. చిలుకమ్మ కండ్లు చెమ్మగిల్లాయి.

ఉదయార్కుడు త్రోవతప్పి చీకటి పడేసరికి పాపం ఒక

అరణ్యంలో చిక్కు పడ్డాడు. కొట్లాడుతూ యుండగా అర్థ రాత్రి వరకూ ప్రయత్నించాడు. వెనక్కు పోదామాయంటే తాను వచ్చిన దిక్కు తెలియదు. చిట్ట చీకటి. గుర్రం నడవడానికైనా తెరిపి తెన్ను లేదు. దానిని అక్కడ విడిచిపెట్టి కాలినడకతో మరి కొంత దూరం పోయేడు. పెద్ద పులులూ, సింహాలూ వీట్ల అరపులు మరింత భయాన్ని కలిగిస్తున్నాయి. కత్తి యిదివరకే ఎక్కడో జారిపడిపోయింది. పడుతూ లేస్తూ కొంత దూరం పోయేడు.

తుట్టతుదకు కొంచం దూరంలోనే అతనికో దీపం కనుపించింది. అక్కడ ఎవరిదో యిల్లు ఉండవచ్చునని, అక్కడ ఆ రాత్రి తల దాచుకొనుటకు ఆ దిక్కు నడచాడు. గుండెలు అరచేత్తో పట్టుకొని ఎలాగో ఆ యిల్లు చేరాడు.

అది కొండ రాళ్లతో కట్టిన కొండ గుహ వంటి యిల్లు. తడుముకుంటూ తడుముకుంటూ పోయి మెల్లగా తలుపు తట్టాడు. చేత్తో మండుతున్న దివిటీ పట్టుకొని తాటకివంటి రాక్షసి కనిపించింది! ఎర్రని గ్రుడ్లతో ఆ రాక్షసి ఎగాదిగ చూస్తూ నోరు చప్పరించి లొట్టలేసి గుటకలేస్తూ ప్రక్కనేయున్న ఒక కొట్టును చూపించింది ... అతని గుండెలు ఝల్లుమన్నాయి. జంతువుల తోళ్లూ, ఎముకలు, మనుష్యుల ఎముకలూ పుర్రెలూ దివిటీ వెల్తుర్లో అతను చూచాడు. ఆ రాక్షసి ఆ రాజకుమారుని ఆ కొట్టు లోనికే నెట్టి తలుపులాగి గొళ్లెం పెట్టింది. మళ్లీ గుర్రు పెడుతూ నిద్రబోయింది.

పాపం ఉదయార్కుడు ఆ త్రోపుతో ఎముకల పోగుమీద పడిపోయి మూర్ఛపోయేడు.

ఆ రాక్షసిపేరు కంకాళి. అది నిద్రబోతున్న గదిలో పెద్ద పులి ఒకటి గొలుసుచే కట్టబడియుండి. దానిని ఉదయార్కుడు చూడనే లేదు. కంకాళితినగా క్రిందనురాలిన మాంసపుముక్కలే దానిభోజనం. మనుష్యుని వాసన దానికి తగలడాన్ని అదిమాత్రం నిద్దుర బోకుండా మధ్య మధ్య గడబడ చేస్తూయుంది.

ఇక్కడ ఇందుబాల వద్దకు

చిలుకవచ్చి "అక్కా! రాజకుమారునికోసం నేను వెదకుతునే యున్నాను. అతని గుర్రంమాత్రం రతనలోయవద్ద మర్రి చెట్టుక్రింద నాకు కనిపించింది. దానిభాషలో నేను దానితో మాట్లాడాను. రాజకుమారుని సంగతి తనకు తెలియదట. దానిని అక్కడే అతడు విడిచిపెట్టి యింకా ఉత్తరానికే పోయాడట. ఆ గుర్రం మాత్రం అతడు వచ్చేవరకూ అక్కడనే యుం ఉందట. కాని కదలదట అని చెప్పింది విచారంతో. ఇందు బాల కొంత సంతోషించి అతడక్కడే ఆ చుట్టుపట్ల ఉంటాడు. నేనుమగవేషంలో పోయి అతన్ని తీసుక వస్తాను. ఒక గంటలో తిరిగి వస్తాను అని తన మనస్సులో అనుకుంది. వేషం మార్చుకుంటూ యుండగా కుడికన్ను అదరింది. ఐనా లక్ష్యపెట్టకుండా చిలుకతోనైనా చెప్పకుండా తనగుర్రంపై బయలు దేరింది.

త్రోవలోనే ఆమెను కొంతమంది రౌతులు పట్టుకున్నారు. వారు మారు వేషాలతో తిరుగుతున్న మదనమోహానుని భటులు. వారామెను బంధించుకొని తమ రాజ్యానికి దారితీశారు!

(తరువాత కథ వచ్చే నెల మిఠాయిబాలలో చదవండి.)



# గుండు!

(కేవలం వినోదానికి రాశాను)

తిరుపతి గుండు
తిన్నని గుండు
చలిమిడి గుండు
చక్కని గుండు
బోడిగుండు
బొప్పాయి గుండు
తాతయ్య గుండు
తక్కెడ గుండు
సాయిబయ్య గుండు
సాఫైన గుండు

రచన: పసుమర్తి కనకరాజు (విజయనగరం)

# ఆటంబాంబు

బాలా! ఆటంబాంబు గురించి ఎప్పుడేనా విన్నావా? మొన్న యుద్ధంలో అమెరికావాళ్లు జపాను పట్టణాలమీద ఆటంబాంబులు వేసి, రూపులేకుండా చేశారు!

ఆటంబాంబు ఒక అద్భుతమైన శక్తి. దీనిని అమెరికావారు కనిపెట్టారు. ఈ బాంబు ప్రేలితే ఎటువంటి గట్టివస్తువైనా, క్షణంలో కరిగిపోతుంది. దీని వేడి ఆరు చదరపుమైళ్లవరకు వ్యాపిస్తుంది.

రచన: నరసింహారావు.


మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే బాధపడుచున్న యెడల వెంటనే

పాత్రుడుగారి

## బాలసంజీవిని

యీయండి

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.

వివరములకు:

## డా॥ పిల్లా పాపయ్య పాత్రుడు & బ్రదరు,

11 దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

కుంభకోణం బ్రాంచి:
నెం. 7, సారంగపాణి కోవిల్ తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి:
నెం. 15, పుగళైపిళ్ళై వీధి, తెప్పకోలం

# జంతు ప్రశ్నలు

(పదిఏళ్ల పిల్లలకు మాత్రమే.)

బాలా !

ఈ ప్రశ్నలకు జవాబులు ఒక నిముషంలో నువ్వు చెప్పగలిగితే నీకు చాలా తెలివి వుందన్నమాట. ఏదీచూద్దాం నీ తెలివి !

1. ఏ జంతువు మొఱుగుతుంది?
2. ఏ జంతువుకి పొడుగు దంతాలుంటాయి?
3. ఏ జంతువుకి బురద ఇష్టం?
4. ఏ జంతువు మనకు ఉన్ని ఇస్తుంది?
5. అడవిలో చారల జంతువు ఏది?
6. ఏ జంతువు గర్జిస్తుంది?
7. ఏ జంతువు ఓండ్ర పెట్టుతుంది?
8. ఏ జంతువు చాలా రోజులు నీళ్లు త్రాగకుండ బ్రతకగలదు?
9. ఏ జంతువు చాలా చాలా పొడవు?
10. ఏ జంతువుమీద విఘ్నేశ్వరుడు ఎక్కుతాడు.
11. ఏ జంతువుమీద శివుడు ఎక్కుతాడు?
12. ఏ జంతువుమీద యముడు ఎక్కుతాడు?

(జవాబులు ఈ సంచికలోనే)




ఆ ఇద్దరు పాపల ఆటలూ, పాటలూ చూచి ఆతల్లి మురిసిపోతోంది.

ఆతల్లి ఆరోగ్యంగా వుండబట్టే అంతచక్కని పిల్లలు పుట్టేరు.

ఆమె ఆరోగ్యానికి ప్రతిరోజూ ఏమిటి పుచ్చుకుంటుందో తెలుసా?

లోధ్ర

కేసరి కుటీరం లిమిటెడ్,

రాయపేట-మదరాసు 14




రచన : కొండపల్లి వెంకటరామ్‌దాస్ (తుని)

# 13 వ మజిలీ

అదే ప్రకారంగా దేవాంతకులైన తాతయ్యా, బాలయ్యా పదమూడవమజిలీ చేరుకుంటూండంగా, ఒక్కసారి వాళ్ల కళ్లముందరపడింది బలే గమ్మత్ ! శుభ్రమైన పాలరాతితో చేయబడిన ఓ పెద్ద నలుచదరపు అరుగు. దాని మధ్యను సరిగా ముప్పై అడుగుల ఎత్తున ఓ పాలరాతి స్తంభము. ఆ స్తంభంమీాదముత్యాల్లాంటి అక్షరాల్లో "ఫకీర్ స్థూపం" అన్న మాటలు అతి అందంగాచెక్కబడి యున్నై!


ఇలాటి వింతలు వాళ్ల కళ్ల పడ్డాంటే, వాళ్లకడుగులు ముందరపడ్తాయా ! ఛట్టున అక్కడే చెట్టుకింద బైటాయించారు. ఇహ బాలయ్యఊర్కుంటాడా! తాతయ్య ఆ విషయం చెప్పేదాకా మింగేశాడు. తాతయ్యా, వాణ్ని ఉషారు చేయటాన్కి, ఏమిటో ఒకక్షణం ఆలోచించి, ఆ "ఫకీర్ స్థూపం" గురించి ఇలా చెప్తూన్నాడు.

## "ఫకీర్ స్థూపం"

చాలా రోజులక్రిందట, ఈ స్థూపం వున్నప్రదేశానికి, కొన్నిక్రోసులదూరంలో "చందనావతి" అనే రాజ్యముండేది. ఈ రాజ్యాన్ని శ్రీముఖుడనే రాజు పరిపాలిస్తూండేవాడు. అతనికి శ్రీవత్సుఅనే ఒక్కగాని ఒక్కకొడుకుండేవాడు. శ్రీవత్సుని తల్లి చిన్ననాటనే పోవటం మూలాన్ని శ్రీముఖుడు తానే తండ్రిగాను, తల్లిగాను ఆ పిల్లాడికి సంరక్షణచేయించి, వయసుకు సరిగా అన్నివిద్యాబుద్ధులు చెప్పించాడు. ఏలాగైతేనేం పది పదిహేనేళ్ల వయస్సొచ్చేసరికల్లా శ్రీవత్సుడు

అన్ని శాస్త్రాలలోనూ విద్యల్లోనూ ఆరితేరినవాడైనాడు.

బాలయ్యా! సరిగ్గా ఈకాలానికే చందనావతికి పొలిమేరలో ఒక తురుష్క రాజ్యముండేది. ఆరాజ్యాన్ని రహీమ్‌ఖాన్ అనే సుల్తాన్ పరిపాలిస్తూండేవాడు. ఈసుల్తాన్‌కు హిందువులన్నా, హిందురాజులన్నా బలే అసహ్యం. అదీగాక వాళ్లమీద శత్రుత్వం సాధించటానికి తనదగ్గఱ ఓ పెద్ద బందిపోటు దొంగల గుంపును అట్టే పెట్టుకున్నాడు. ఈ దొంగలగుంపు సాయంతో రాత్రికి రాత్రి తనశత్రురాజ్యాలపై బడటం దొరికినంతమటుకు "కైమా" చేసి, పట్నాలుతగలపెట్టించేసి, బోలెడు ధనధాన్యాలు దోచుకుపోతుండేవాడు.



అయితే, చందనావతీరాజ్యాన్ని దోచుకుపోదామనుకున్నాడు. కాని అదృష్టాన్న, చందనావతీ వాళ్లు పొలిమేరలలో నాల్గు పెద్ద పర్వతాలుండటంవల్ల రహీమ్‌ఖాన్ ఆటలు సాగలేదు. అయినా సమయంవస్తే, చందనావతిపై బడటానికి సిద్ధంగావున్నాడు.

ఇవతల శ్రీముఖుడుకూడా మంచి జాగ్రత్తలో వున్నాడు. తనరాజ్యానికీ, తురుష్కరాజ్యానికి తూర్పుదిక్కుగా వున్న పర్వతంలో ఒక కనుమ దారి వుండేది. ఈసంగతి రహీమ్‌ఖాన్‌కు తెలియనప్పటికీ, ఎందుకైనా మంచిదని మాంచి దిట్టమైన సైనికులను కాపలా వేయించి వుంచాడు. రాత్రింపగళ్లు ఆవీరసైనికులతి మెలకువతో ఆ కనుమదారి కాపాడ్తున్నారు.

ఇదిలా వుండగా, రహీమ్ రాజ్యంలో బలే విశేషం జరిగింది. అదేమిటంటావేమో! రహీమ్‌ఖాన్ ఆస్థానంలో - ఓ ముసాలి ఫకీర్ రహీమ్ తాత తండ్రుల

కాలంనుంచీ వుంటూండేవాడు. ఈ ఫకీర్‌ని రహీమ్‌తాత తండ్రుల కాలంనుంచీ తమగురువుగా ఎంచుకొంటూ వుండేవారు. ఈఫకీర్‌కు కొంచెం మంత్ర తంత్రాలుకూడా తెల్సునని వాడుకగా వుండేది. ఏమైనా ఫకీర్‌కు మాత్రం, హిందువులన్నా, వాళ్ల మతాచారాలన్నా, ఓ విధమైన అభిమానం. తాను తురుష్కుడైనా అనవసరంగా ఓ హిందువు బాధపడ్తూంటే చూడలేక పోయేవాడు. అందువల్లే అతను రహీమ్‌కు శత్రువై పోయాడు. ఎన్నోసార్లు "హిందువులను హింసించటం మహాపాపం. వాళ్లూ మనలాంటి మనుష్యులే. అందుకని వాళ్లూ, మనం సోదరుల్లా కలసి మెలసి వుండాలి'' అని బోధపరుస్తూండేవాడు ఫకీర్. ఈ మాటలు విషమై పోసాగినై, రహీమ్‌పట్ల! ఫకీర్ చెప్పిన నీతులన్నీ బూడిదలోపోసిన పన్నీరైనాయ్! ప్రతిదానికీ అడ్డురావటం, రహీమ్‌కు ఇష్టంలేక పోయింది. ఇహా! చివరికి, తన మత గురువనైనా యెంచకుండా, ఆ ముసలి ఫకీర్ నిద్దరోతూన్న సమయంలో అర్ధరాత్రి కాళ్లూ, చేతులూ కట్టించి, ఓ పెద్ద నదిలో పారవేయించి, పీడ వదిలిందనుకున్నాడు. చూడు బాలయ్యా! దుర్మార్గు డెలాంటి అఘాయిత్యం చేశాడో! అయితే! మనోబలంగల ఆ ఫకీర్ ఎలాగో ఆ గండంనుంచి బయటపడి, దూరంగాపోయి లాభంలేదు. వీలుంటే ఎప్పటికైనా వీడ్ని బాగు చేయాలి, అవసరమైతే తన ప్రాణాలుకూడ వదిలేయాలి, అని నిశ్చయం చేసుకొని, చందనావతీ - తురుష్కరాజ్యాల సరిహద్దు పర్వతగుహాలలో తన నివాసం ఏర్పాటు చేసుకొన్నాడు.

అవతల చందనావతీ యువరాజు శ్రీవత్సుడు మంచి వీరుడైయ్యేడు. శ్రీవత్సుడికి అన్నిటికన్నా వేటాడటం అంటే బలే సరదా. అందుకని, రోజూ వంటరిగానే గుఱ్ఱంమీద బయలుదేరి వేటాడి వస్తూండేవాడు. రోజూ వేటాడటాన్కి వెళ్లేముందు తండ్రికి నమస్కరించి, చెప్పి మరీ వెళ్లేవాడు. శ్రీవత్సుడు తండ్రితో చెప్పడానికి వెళ్లేటప్పుడు రోజూ శ్రీముఖుడు కొడుకుతో ఇలా

అనేవాడు. "నాయనా! వెళ్లితే వెళ్లేవ్ గాని, తూర్పు దిక్కుగా మాత్రం పోకుసుమా!" అని మాత్రం హెచ్చరించేవాడు. శ్రీవత్సుడు వేటసరదాలో, అలానే నాన్నా అని ఊరుకుండే వాడు కాని, ఏమి, ఎంచేతా అని అడ్డు ప్రశ్న వేశేవాడుకాదు. అయినా తండ్రి రోజూ తనతో అదే విధంగా చెప్పటంలో రాను రాను, తూర్పు దిక్కంటే ఓ సమస్య అయిపోయింది శ్రీవత్సునకు. ఇందులో విశేషం ఎప్పటికైనా కనిపెట్టాలని నిశ్చయించాడు.

ఉన్నట్టుండి ఓరోజు మామూలుగా వేటకని బయలుదేరి తూర్పు దిక్కు పట్టించాడు తన గుఱ్ఱాన్ని శ్రీవత్సుడు. వెళ్లి వెళ్లి, తూర్పు దిక్కున వున్న పర్వతందగ్గఱకు చేరుకున్నాడు. ఆపర్వతం అంతా కలియదిరిగాడు. ఆఖరుకి కనుమదారిదగ్గఱకు చేరుకున్నాడు. అక్కడ తమరాజ్య సైనికులుండటంచూచి ఆశ్చర్యపడ్డాడు. ఎవర్నడిగినా ఇటు వెళ్లొద్దు బాబూ అనేవారేకాని, అందులో విశేషం చెప్పేవారు కారు. శ్రీవత్సునకు ఈదారమ్మట ఏమైనసరే పోవాలన్న ఆతృత ఎక్కువైంది. వాళ్లందరూ వద్దంటూన్నా ధబాయించేసి చెంగుమని తనగుఱ్ఱాన్ని ఆకనుమదారిగుండా పోనివ్వసాగాడు. చేసేది లేక సిపాయిల్లో కొంతమంది చందనావతికి పరిగెట్టారు శ్రీముఖునితో ఈ సంగతి చెప్పటానికి. శ్రీవత్సుడు మాత్రం తనగుఱ్ఱాన్ని బలే హుషారుగా ఆకనుమదారిగుండా పరిగెత్తిస్తూ ముందుకు పోతున్నాడలా!

వెళ్లగా వెళ్లగా, ఎంత వెళ్లినా ఆదారి తరగటంలా! చాలా అలసిపోయ్యాడు పాపం శ్రీవత్సుడు. ఏదైనా ఆశ్రయం దొరకుతూందేమోనని ఆలోచిస్తూ నాల్గుప్రక్కలా చూడటంలో, కనుచూపు మేరలో ఒక కొండగుహ వున్నట్టుగా తెల్సుకొన్నాడు. తక్షణం అక్కడకు గుఱ్ఱాన్ని పరిగెత్తించాడు. తీరా వెళ్లేటప్పటికి ఆగుహలో ఫకీర్ కన్పించాడు. ఈ ఫకీర్ ఎవరో కారు, మనకథలో పకీరే! ఫకీర్ శ్రీవత్సుడ్ని చూచీ చూడటంతోటే అతన్ని ఆదరించి కూర్చో

పెట్టి, అతన్నిగురించి అడిగి తెలుసుకొన్నాడు. శ్రీవత్సుడు ఊరుకోక ఫకీర్ సంగతిని చెప్పమని బలవంతపర్చాడు. చివరకి, ఫకీర్ తన కథంతా చెప్పేడు: "నాయనా! ఇహా ముందుకు వెళ్లకు. దుర్మార్గుడైన ఆసుల్తాన్ కళ్లపడ్తే ప్రమాదమొస్తుంది. అయినా ఒక్క సంగతి మరవకు. ప్రపంచకంలో మనుష్యజాతి అంతా ఒకటే. హిందువులనీ, తురకలనీ భేదం పనికిరాదు. ఎప్పటికైనా హిందూ, తురుష్కులు కలిసివుంటేనే లోకకళ్యాణం. కాని, నీరాజ్యంలో అమాయకప్రజలు తురుష్కుల దాడికి బలిఅవకుండా రక్షించటానికి సిద్ధమైయుండు. ఎప్పుడైనా, ఒక్కసారి ఆతుచ్ఛుడు మీరాజ్యంపై పడగలడు." ఈ మాటలుచెప్పి ఫకీర్ శ్రీవత్సుణ్ణి ఇంటిముఖం పట్టించాడు.

హఠాత్తుగా అనుకొన్నట్లే రహీమ్ సైన్యాలేలానో దారికన్పెట్టి చందనావతిపై దాడిసల్పినై. అయితే! చందనావతీ సైన్యాలుకూడా, ముందే జాగ్రత్త పడియుండటంవల్ల ఢీఢీమని ఢీకొన్నాయ్; ఘోరయుద్ధం అవుతూంది. అంతలో ఓప్రక్కన, శ్రీవత్సుడు, రహీమ్‌ఖాను ఇద్దరూ యుద్ధంచేయసాగారు. ఒకరువేసిన బాణాలను, ఇంకొకరు విరచివేస్తే ఇలా అతిభయంకరంగా పోరాడసాగేరు. చిన్నవయస్సువాడైనా శ్రీవత్సుడు ముష్కరుడగు రహీమ్‌తో సమానంగా చాకచక్యంతో పోరాడటంచూచి, రెండుప్రక్కలా వున్న కొంత సైన్యం, వాళ్లిద్దఱియుద్ధం చూడటం మొదలుపెట్టారు. చివరకి పోరాడగా, పోరాడగా, ఇద్దఱూ ఒకర్నొకరు చంపేయాలన్న కక్షతో, వాళ్లదగ్గఱున్న బల్లెములను విసరుకున్నారు. ఆశ్చర్యం బాలయ్యా! ఈలోపున ఎక్కడ్నుంచివచ్చాడో ఫకీర్ ఆ క్షణంలో ఇద్దరిమధ్యకూ రావటం ఇద్దరూవిసరిన బల్లేలు సరిగా అతని కడుపులో గ్రుచ్చుకోటం, రెండూ ఒక్కసారి జరిగినై. పాపం, హా! అంటూ నేలకొరిగాడు.

ఇంకేముంది! ఫకీర్ నేలకొరగటంతో, రెండు పక్షాలవారూ నిశ్చేష్టులై యుద్ధం ఆపేశారు. శ్రీవత్సుడు, ఫకీర్ తలను తన వడిలో నుంచుకొని, ఇదేంపని

చేశారంటూ వగవసాగాడు. దుర్మార్గుడైన రహీమ్‌కుకూడా కళ్లు చెమ్మగిలినై. తనెంతపని చేసినా తనయందు చివరిదాకా ప్రేమ చూపించినా ఫకీర్ స్థితిచూచి, హృదయం కరిగి అతని మీదపడి




ఏడవటం మొదలెట్టాడు. ఫకీర్ మాత్రం, శ్రీవత్సుడిచేయి, రహీమ్‌చేయి కలిపిపట్టుకొని, తన హృదయంమీద నుంచుకొని, "నాయనలారా! హిందూ, తురుష్కులుకలిసి, సోదరభావంతోవుంటేనే దేశకళ్యాణం" అంటూ ప్రాణంవిడ్చాడు. ఫకీర్ పోయినమరుక్షణంనుంచి, రహీమ్ బుద్ధిమారిపోయింది. అతను వెంటనే యుద్ధం ఆపుచేయించి తన రాజ్యానికి మరలిపోయాడు. అప్పట్నుంచీ,ఒక చందనావతి రాజ్యంలోనేకాక, అన్ని హిందూ రాజ్యాల్లోనూ ఐకమత్యంగా వున్నాడు. ఇంతటికీ మూలకారణుడైన ఫకీర్ జ్ఞాపకార్థం, ఇప్పుడు మనం చూస్తూన్న ఈస్థూపం కట్టించాడు. తెల్సిందా బాలయ్యా, అని తాతయ్య మరీలా అన్నాడు:

"అన్నట్టు బాలయ్యా! వచ్చే మజిలీలో నీ పుట్టినరోజు వస్తూంది. అప్పుడుఇంకా బలేసంగతులు చెప్పుకుందాంలే. మరిలే" అంటే బాలయ్య ఉషారుగా లేచి, తాతయ్యోయ్ బలేసంగతులు కన్పిస్తూన్నాయ్. మన అదృష్టం అంటూ మూటాముల్లె పట్టుకుని, చంకలెగరేస్తూ తాతయ్యను అనుసరిస్తూన్నాడు. వచ్చేమజిలీలో మరో మంచిసంగతి చెప్తా—వేం!!

# నడిచే పిట్ట


రచన: గుడివాడ వెంకటసుబ్బారావు (ఉంగుటూరు.)

బాలా!


ఇదివరకు "తలా తోకా వూపుపిట్ట" "పలికే పిట్ట" చేయుట నేర్చుకొన్నావు కానీ నీతో సరదాగా షికారుకు వెళ్లినప్పుడు నీతో నడిచే పిట్టను చేయాలని సరదాగా నున్నదా? అయితే యీ క్రింది వస్తువులు తెచ్చుకో:

1. మట్టి; 2. అట్ట; 3. దారము; 4. రబ్బరు; 5. పలుచటి వెదురుబద్ద.

ఈ వస్తువులన్నీ సంపాదించావా? అయితే ముందు ఏమిచేస్తావంటే మట్టిని గుండ్రముగా ఒక అంగుళము పొడవుని చక్రముగా (బండిలాగా) తయారుచేసి మధ్య చీపురపుల్లతో బెజ్జముపెట్టి దానిని ఎండబెట్టుము. తరువాత అట్ట మధ్యకుమడచి ఈ క్రింది విధముగా కత్తిరించు.




తరువాత వెదురుబద్దను పలుచగా చెక్కి పిట్ట పొట్టమధ్య అనగా గీతపెట్టినచోట ఇవతలనుండి అవతలకు గ్రుచ్చుము. తరువాత మట్టి చక్రము మధ్య బెజ్జములో ఈ రబ్బరును అవతలనుండి ఇవతలకి వచ్చులాగున చేసి అది తిరగకుండా చీపురపుల్లను మరల అందుంచి గట్టిగా కట్టవలెను. తరువాత పిట్ట పొట్టమధ్య గ్రుచ్చిన వెదరుబద్దకు ఈ చక్రము పిట్టపొట్టకు మధ్యగా వచ్చులాగున రబ్బరును బిగించి కట్టవలెను. ఇప్పుడు అది ఈక్రింది విధముగానుండును.



ఇంకేముంది? మట్టిచక్రమునకు ఎదురుగా పిట్ట పొట్టలోనున్న వెదురుబద్దకు సన్నని బెజ్జముపెట్టి ఈ మట్టి

ముద్దను పిట్ట తలవేపుకు త్రిప్పవలెను బాగా రబ్బరు పురి ఎక్కిన తరువాత దారమును గట్టిగాఆ మట్టిచక్రమునకు పైన ఎదురుగానున్న వెదురుబద్ద బెజ్జముగుండా పిట్ట వీపుమీద ఒక బెజ్జముపెట్టి ఆధారమును పైకి తీసుకురావలెను. అప్పుడు అది ఈ క్రింది ఆకారముగానుండును.



ఆడించాలని అనగా నడిపించాలని సరదాగా వుందా? అయితే ఇందాకరబ్బరుకు బాగా పురిపెట్టిన తరువాతకదా దారమును కట్టితిమి. ఇప్పుడు దారమును వదిలిన అది చక్కగా పురి పోవువరకూచుట్టుకొనును. తరువాత లాగిన ముందుకు చక్కగా నడుచును. బాగుందా బాలా!

తమాషాలు

## మందు

[సోము ఒంట్లో జబ్బుగావున్నా ఆవకాయ తింటున్నాడు.]

రాము:- కళ్లుమూసుకొని ఆవకాయ తినుచున్నావేమిరా సోమూ!

సోము:- డాక్టరుగారు జబ్బు నిమ్మళించేవరకు ఆవకాయను కళ్లతో చూడవద్దన్నారు.

—వై. కమల (కోవూరు)

## పడడం

బాలుడు:- సార్! మీరు పడితే మాకు సంతోషమండీ!

మేష్టారు:- ఓరి ఫూల్! నేను పడి, కాలో చెయ్యో విరిగితే నీకు సంతోషమట్రా!

బాలుడు:-అదికాదండీ - మీరు మాక్లాసుకు పడితే సంతోషం.

—చివుకుల గోపాలకృష్ణమూర్తి (సంత నూతలపాడు)

## కలపడం

మేష్టారు:- సోమూ! ఒకటికి అయిదుకలిపితే ఏమవుతుందిరా?

సోము:- నాలుగు

మేష్టారు:- నీ మొహం! ఎలాగో చెప్పు?

సోము:- I కి V కలిపితే IV కదండీ!

"ముసునూరి" (పెద్దాపురం)




కానన్ ష్మిట్ కు

వేలూరి శివరామశాస్త్రి

అనుసరణ

# వెదురు పేడు

సర్కారు జవాను ఒకానొక చీకటి రాత్రి దస్తు మోసుకొని పోతూవున్నాడు. దారిలో దొంగలు వానిని చంపి ఆ దస్తు హరించారని అలజడి కలిగింది. పొద్దున్నే చూచినవారికి ఒక నెత్తురు ముద్ద కనిపించింది!

ఈ వార్త తెలియగానే మేస్ట్రీటు అక్కడికి వెళ్లి చూచాడు. ఆ శవము దగ్గర ఒక వెదురుపేడు పడి ఉంది. ఆ మేస్ట్రీటు ఆ పేడు జేబులో వేసుకొని వెళ్లిపోయాడు.

మరునాడు ఆఫీసులో జవానులందరూ నిలబడి ఉన్నారు. ఒకని చేతిలో వెదురు కర్ర ఉన్నది. దాని కణువు దగ్గర ఒక పేడు పోయి ఉంది. ఆ జవానే ఆ పని చేశాడని మేస్ట్రీటుకు తెలిసిపోయింది. అతడా జవానుకు సంకెళ్లు వేయించి కొట్లో పడేయించాడు.

వాడు ఎంత అడిగినా తన తప్పు ఒప్పుకోలేదు. కాని మాటలు రాని ఆ వెదురుపేడే సాక్ష్యం చెప్పేసింది. ఆ వెదురు పేడు తెచ్చి వాని కర్రకు అంటించారు. అది సమ్మగ సరిపోయింది. అప్పుడు వాడు తెలతెలపోయి "అయ్యా! నాడు దస్తు తీసుకొని పోవడం నాకు తెలుసు. అతడూ నేనూ స్నేహితులమే. అయినప్పటికీ ధనమ్మీద ఉండే మోహాంచే వానిని నేనే చంపాను. అదిగో

ఆ సంచీ విప్పకుండా ఆ కర్రల కింద ఉంది'' అని చెప్పాడు. కొందరు నవుకర్లు పరుగెత్తి ఆ సంచి తెచ్చారు. వీలు లేక పోవడంవల్ల వాడాసంచి విప్ప లేదు. ఎట్లాఉన్న డబ్బట్లా ఉంది. అప్పుడా మేజస్ట్రేటు జనులంతా చూస్తూ వుండగా ఆ సంచి వాని మెడకు కట్టించి ఉరి తీయించాడు.

చేయు మేనెగవులచే నేని గుట్టు
న్యాయంబు దోషి నెంతయు బైటబెట్టు

●

## పగ్గము

ఇద్దరు బిచ్చగాళ్లకు దార్లో ఒక పగ్గం కనబడ్డది. నాదంటే నాది అని వారిద్దరూ తగవులాడారు. కొండలు మోగి పోయేట్టు తిట్టుకున్నారు. ఒకడా చివరా ఇంకొకడీ చివరా పుచ్చుకొని లాగుకోడం మొదలు పెట్టారు. చివికిన ఆ పాత పగ్గం పుటుక్కున నడిమికి తెగింది. ఒకడు బురదగుంటలోనూ ఇంకోడు పేడగుంటలోనూ పడ్డారు. ఒకడంతా బురదా ఒకడంతా పేడా.

దారిపోయే బాటసారి ఒకడీతంతంతా చూచి తగవులాడేవారి గతంతా ఇంతే. పైసా చేయని పాడు తాడుకు పులుల్లాగా మీరు పోరాడారు. తగూలాడే వారందరూ మీలాగే బురదా పేడా ఐపోతారు అని అన్నాడు.

తగవులాటకుఁ గాలుఁద్రవ్వెడి వారి
కగచాట్లు చీవాట్లు నమరు నవారి.

●

## ప్రేము ఈతాకులు

పేరమ్మ పేదదీ ముసలిదీను వండుటకు కట్టెలులేక తన ఇద్దరు కొడుకులనూ వెంటబెట్టుకొని నాగు ఒడ్డుకు వెళ్ళి ఎండిన వేప చువ్వలూ ఈతాకులూ పోగుచేసి మోపులుకట్టి తెచ్చుకుంటూంది. ఇలా వాళ్లు ముగ్గురూ మూడు మోపులతో ఊళ్లోకి వస్తూండగా వారికి ఒక సాహుకారు ఎదురు పడ్డాడు.

వారందరూ మోపులు కింద పడేసి "మా రాజా! తిండికి

లేని వాళ్లం; ధర్మం చేయండి" అని చేతులు చాచారు.

అతడా ముసలమ్మకు మూడు రూపాయలిచ్చి "ముసలమ్మా! నీవు నీ కొడుకులను నాకు అప్పగించు! ఇక ముష్టి యెత్తుకో నక్కరలేకుండా చేస్తా. ఎల్లా అంటావేమో, ఈ పేములోనూ ఈ ఈతాకులలోనూ బంగారం ఉంది. దాన్ని పైకితీసే విధం వీరికి నేర్పుతా" అని అన్నాడు. సాహుకారు నవ్వుతాలకు అంటున్నాడని పేరమ్మ అనుకుంది. కాని అది నిజమే అని సాహుకారు ఒత్తి చెప్పాడు. పేరమ్మ తుదకు అంగీకరించి తన కొడుకులను అతని వెంట పంపింది.

ఆ సాహుకారు వారిద్దరికీ ప్రేముతో బుట్టలూ పెట్టెలూ కుర్చీలూ చేయడమూ ఈతాకులతోటి చదరులూ చాపలూ అల్లడమూ నేర్పించాడు. కొద్దిరోజులలోనే వాళ్లు ప్రవీణు లయారు.

వారు మూడేండ్లకు ఇంటికి తిరిగివచ్చి కుర్చీలు మొదలగునవి చేసి తమకు నేర్పించిన సాహుకారుకు పంపడం మొదలు పెట్టారు. కొన్నాళ్లకు వాట్లవెల ఇవ్వడానికివచ్చి ఆ సాహుకారు కాసులు చూపుతూ "ముసలమ్మా! నేనన్నమాట నిక్కమా కల్లా?" అని అడిగాడు.

పనికి రాదనుకొన్న వస్తు వదేది?
దీనికి శ్రమయన్నది పరుసవేది.

●

# సంత

ఒక పల్లెటూళ్లో డబ్బుగలామె ఒకతె ఉంది. ఆమెకు సంతతి లేదు. తన బంధువులలో ఒక్కొ నేర్పూ పనీపాటూ తెలిసిన ఒక పిల్లను పెంచుకోదలచి దాపున ఉన్నపట్నం వెళ్లింది. ఈ సంగతి అందరూ గ్రహించారు. అయిన వాళ్లూ కానివాళ్లూ లేనిపోని చుట్టరికాలుచెప్పి పిల్లలతో ఆమె చుట్టూ మూగడం మొదలు పెట్టారు.

ఆమె వారి చుట్టరికాల నన్నిటినీ అటుండనిచ్చి అందరినీ సమంగా గౌరవించి ప్రతి పిల్లకూ కొంత డబ్బిచ్చి "రేపు ఇక్కడ సంత. ఈ డబ్బుపెట్టి మీకు ఇష్టం వచ్చిన వస్తువులు కొనుక్కోండి; మీరు మాత్రం కొనుక్కొన్న ప్రతి వస్తువునూ

నాకు చూపి మరీ పట్టుకుపోండి" అని షరతు పెట్టింది.

ఆ మరునాడు వారందరూ సంతకు వెళ్లి ఎవరికి తోచిన వస్తువులు వారు కొనుక్కొని ఆమె వద్దకు వచ్చారు. ఒక పిల్ల ఆమెకు బూరా చూపింది. ఇంకొక పిల్ల గాజుకుక్క చూపింది. ఒకతె లబ్బరు కప్ప చూపి కీచుకీచుమనిపించింది. ఇంకొకతె కోతిని చూపి ఎగిరించింది. ఒక పిల్లమాత్రం ఒక రాటమూ కదురూ పంటె చూపింది.

ఆమె ప్రీతి పూర్వకంగా ఆ అమ్మాయిని ఒడిలోకి తీసుకుని "వీరందరిలోకీ నీవు నచ్చావు. నిన్నే నేను పెంచుకుంటాను" అని చెప్పి తల్లి అంగీకరించిన మీదట ఆ పిల్లను వెంటబెట్టుకొని వెళిపోయింది.

మన చిన్న పనులె నూ మన మదినుండు
మంచి సెబ్బరలను మరి చాటుచుండు


(1)

పిల్లవాడు ఏడుస్తున్నాడు



(కారణంలేకుండానే)

(2)

అతనికి గ్రైప్ సిరప్ ఇవ్వండి



(అసహ్యమైన రుచిలేదు)

(3)

పిల్లవాడు నవ్వుతున్నాడు



ఒక I.T.L. ప్రాడక్టు మైసూర్ ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లేబొరేటరీస్ బెంగుళూరు

BGK-16-TG

సెల్లింగ్ ఏజెంట్లు : బెస్టు అండ్ కో., లిమిటెడ్ P. B. నెం. 63, మద్రాసు

# ఉత్తరం చెప్పేస్తుంది!

సంపాదన : కట్టా సూర్యారావు (పద్మర గోనగూడెం)

ఇవి వేసవికాలం రోజులు. మామిడిపండ్లు బోలెడు.

ఒకనాడు ఒక కాపు తన చుట్టాలికి వంద మామిడిపండ్లు ఒక గంపలో పెట్టాడు. గంపలో వంద ఉన్నట్లుగా ఉత్తరంలో వ్రాసాడు. కాపు తన పాలికాపును పిలిచి గంపను, ఆ ఉత్తరాన్ని పొరుగూరులో ఉన్న తన చుట్టాలికిమ్మన్నాడు. ఇంకా ఆ గంపలో ఎన్ని పండ్లుగలవో ఆ ఉత్తరమే వారికి చెపుతుంది అన్నాడు.

వేసవికాలంకదా! కొంత నడిచివచ్చాక పాలికాపుకి ఆకలి, దాహంవేసింది. దారిలో నీళ్లు దొరకలేదు. ఒకవేళ మామిడి పండ్లుతింటే ఆ ఉత్తరం చూచి చెప్పుతుందని భయంవేసింది. కాని అంతకంతకు దాహం ఎక్కువౌతుంది. కొంతసేపు ఆలోచించాడు. ఆ ఉత్తరాన్ని దారిలో మట్టిలో కప్పెట్టి ఆ ఉత్తరం తనని చూడకుండా తినాలనుకున్నాడు. ప్రక్కకుపోయి పొదచాటున గంపలోని పండ్లు ఆకలిదీరా తిన్నాడు. ఆ ఉత్తరం తనచేతుల్ని వాసనచూచి చెపుతుందేమో అని మట్టితో చేతుల్ని మూతిని తుడుచుకొని మట్టిలోకప్పిన ఉత్తరాన్నితీసి తలపాగలో పెట్టి కొంతసేపటికి గమ్యస్థానంచేరుకున్నాడు. పండ్లగంపను, ఉత్తరమును తనకాపు చుట్టాలకిచ్చేడు.

చుట్టం ఉత్తరం చదువుకొని పండ్లు లెక్కపెట్టుకొని పదితక్కువ వచ్చినందుకు ఆశ్చర్యపోయాడు. ఉత్తరం తన దొంగపనిని ఎక్కడ చెపుతుందోయని భయపడ్డాడు పాలికాపు. అనుకున్నట్లుగానే కొంతసేపటికి చుట్టం పాలికాపుని పదిపండ్లు తక్కువఉండడానికి కారణం అడిగాడు. పాలికాపు మీకు ఎవరు చెప్పారని చుట్టాన్ని అడిగాడు. చుట్టం ఉత్తరంఅన్నాడు. పాలికాపు మాట్లాడలేకపోయేడు. ఉత్తరం మట్టిలోంచి ఎలా చూచి చెప్పిందా అనుకున్నాడు. చుట్టం నవ్వుతున్నాడు. చుట్టం ఎందుకు నవ్వుతున్నాడూ చెప్పు బాలా!



# అంకెల తమాషా



బాలా! ఈ లెక్కల తమాషా చూశావా!

|  |
|---:|
| 1 2 3 4 5 6 7 8 9 |
| 9 2 3 4 5 6 7 8 9 |
| 9 8 3 4 5 6 7 8 9 |
| 9 8 7 4 5 6 7 8 9 |
| 9 8 7 6 5 6 7 8 9 |
| 9 8 7 6 5 6 7 8 9 |
| 9 8 7 6 5 4 7 8 9 |
| 9 8 7 6 5 4 3 8 9 |
| 9 8 7 6 5 4 3 2 9 |
| 9 8 7 6 5 4 3 2 1 |
| 1 8 7 6 5 4 3 2 1 |
| 1 2 7 6 5 4 3 2 1 |
| 1 2 3 6 5 4 3 2 1 |
| 1 2 3 4 5 4 3 2 1 |
| 1 2 3 4 5 4 3 2 1 |
| 1 2 3 4 5 6 3 2 1 |
| 1 2 3 4 5 6 7 2 1 |
| 1 2 3 4 5 6 7 8 1 |
| **9 9 9 9 9 9 9 9 9 0** |

|  |
|---:|
| 1 2 3 4 5 6 7 8 9 |
| 2 3 4 5 6 7 8 9 |
| 3 4 5 6 7 8 9 |
| 4 5 6 7 8 9 |
| 5 6 7 8 9 |
| 6 7 8 9 |
| 7 8 9 |
| 8 9 |
| 9 |
| 9 8 7 6 5 4 3 2 1 |
| 8 7 6 5 4 3 2 1 |
| 7 6 5 4 3 2 1 |
| 6 5 4 3 2 1 |
| 5 4 3 2 1 |
| 4 3 2 1 |
| 3 2 1 |
| 2 1 |
| 1 |
| **1 2 3 4 5 6 7 8 9 0** |

కూర్పు: ఆయపిల్ల గౌరీశంకర్ (తాతానగర్)

# ఎద్దుకు పై పండ్లు-?

రచన : శ్రీపాద వెంకన్న

ఒక నాడు నేను మా బాలా అలా షికారు కని బయలు దేరాం. దారిలో ఒక ఎద్దు కన బడింది. "బాలా! ఎద్దుకి పైపళ్లు వుండవు తెలుసా? అని నేను గొప్పగా చెప్పాను.

బాల నేను చెప్పినది విని, కొంచెంసేపు ఆలోచించి ఇలా అంది: "కావాలంటే నేను ఎద్దుకి పైపండ్లుచూపుతా చూస్తావా?"

ఎద్దుకి పై పండ్లు లేవని నాకు బాగా తెలుసును. బాల, ఎద్దుకి పై పండ్లు చూపుతానని అంది.

"ఏదీ చూపించు పందెం" అన్నాను నేను.

ఇద్దరం ఎద్దుదగ్గరికి వెళ్లి చూస్తే పైపండ్లు లేవు. "చూశావా? నేను చెప్పింది నిజమేనా?" అని అన్నాను. ఇంతలో బాల, ఏం చేసిందో తెలుసా? తననోరు "ఈ" అని విప్పి తనపై పళ్లు ఎద్దుకి చూపడం ఆరంభించింది. "ఇదేమిటే ఈ వికారం!" అని నేనన్నాను.

"ఎద్దుకి పైపండ్లు చూపుతానన్నానుగా! ఇదుగో పైపండ్లు చూపించాను. ఏం?" అంది బాల, యుక్తిగా!



వృ ష భా పి ల కా చా ర్యు లు

# బాలసంఘాలు

## ఆంధ్ర కేసరి బాల సాహిత్య సమితి, వంకాయలపాడు:

జూన్ 12 తేదీని శ్రీ వి. రమణయ్యగారి అధ్యక్షతను సభజరిగింది. కార్యదర్శి అంజిరెడ్డిగారు నివేదిక చదివారు. "పాఠశాల-బాలురు" అను విషయము గురించి శ్రీ పి. రామిరెడ్డి, కే. రామకోటి, బి. అంజిరెడ్డి మొదలగు బాలురు మాట్లాడిరి.

## సుభాస్ బోస్ బాల సంఘం, వాల్తేరు:

క్రిందటినెల పోటీలో శ్రీ కె. పి. రావు (మజ్జివలస) గారికి బహుమానము పంపబడెను.

ఒచ్చేనెల ఆగస్టు 15 తేదీని స్వాతంత్రదినం, బాల పుట్టినరోజు పండుగచేయ నిశ్చయింపబడెను. గ్రంథాలయము, బాలురకొరకు స్థాపింపబడెను.

## అరుణా బాల సంఘం, రేలంగి:

జూన్ 10 తేదీని ఈసంఘం స్థాపింపబడింది. అధ్యక్షులు శ్రీ పి. వి. రత్నంగారు. ఎస్. విశ్వనాధమూర్తిగారు కార్యదర్శి. చదువులో మంచిమార్కులు వచ్చినవారికి "బాల" పత్రికలు బహుమానముగా ఇవ్వబడును.

## బాపూజీ బాల సంఘం, కూచిమంచి వారి అగ్రహారం అమలాపురం

ఈసంఘం జూను 12 తేదీని కొత్తగా స్థాపించబడింది. అధ్యక్షులు ఏ. వీరభద్రరావు, కార్యదర్శి బి. కృష్ణమోహన్ గార్లు.

## నేతాజీ బాలసంఘం, ఏలూరు:

ఈసంఘం వార్షికోత్సవం గతనెల జరుపబడెను. అప్పుడు "శ్రీ కృష్ణుని సంధి ప్రయత్నము" అనే నాటిక ప్రదర్శింపబడెను. శ్రీ గుంటూరి వెంకటేశ్వరశర్మకు, పల్లా సూర్యనారాయణ శాస్త్రిగారికి బహుమతులు ఇవ్వబడెను. "భారతమాత" అనే మాసపత్రికను నడుపుటకు తీర్మానించిరి.

## భవానీ బాలసంఘం, వాల్తేరు:

మేనెల వ్యాసరచన పోటీలో కె. నారాయణమూర్తిగారికి బహుమతి వచ్చింది. జూన్ 4 వ తేదీసాయంత్రం ఐ. బి. పంతులుగారి అధ్యక్ష్యతను బీచిమీద జరిగిన సభలో వారికి "బాల" పుస్తకం బహుమతి ఇవ్వబడింది.

## విద్యార్థి బాలసంఘం, పాలకొల్లు:

ఈసంఘం కార్యదర్శి బి. వి. రాధారమణగుప్తగారు, ఒక "ఆలోచనసభ" పెట్టారు. ఈఆలోచనసభకు మేనేజరు పి. రామకృష్ణగారు. అన్ని బాలసంఘాలతోనూ పరిచయము కలుగజేయు సద్దేముకలదు. అన్ని బాలసంఘాలవారు పైసంఘానికి రాయండి.



# నేస్తాలు

బాలలూ!

చాలామంది నేస్తాలు తమకు వచ్చిన ఉత్తరాలకు జవాబులు రాయకుండా వున్నారని తెలుస్తోంది. సరదాగా కొత్త స్నేహితులతో ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతేనే అందులో ఆనందం. అంతే గాని, "నేస్తాలు"లో పేరుపడడంకోసం కాదు.

నెల్లూరు అల్లీపురంనుంచి శ్రీ బండి రామాకృష్ణరెడ్డి ఇలా రాస్తున్నాడు:

"నేస్తాలన్నయ్యా! నేను, బెజవాడ పి. మాధవరావు (నేస్తం)కి ఎన్ని ఉత్తరాలు రాసినా జవాబు ఇవ్వలేదు. ఇంకా ఎందరో జవాబు రాయకుండా ఎగ్గొట్టినవారు. వాళ్లందరికీ వందనాలు".

చూశారా! నేస్తాలు కావాలని కోరి, ఉత్తరాలకు జవాబులు రాయకపోవడం ఏమైనా బాగుందా?

ఇంకో విషయం ఏమిటంటే 15 ఏళ్లకు మించినవారుకూడా నేస్తాలు కావాలంటున్నారు. అలాగ వారు రాయకూడదు.

కావాలి! కావాలి!

ఈ దిగువవారికి నేస్తాలు కావాలి.

### రాజకీయాలలో సరదా

పి. వి. సుబ్బారావు, IV C పి. డి. యమ్. హైస్కూలు, విశాఖపట్టణం.

### కొత్తకథలూ, గాథలూ సరదా

వి. వి. రమణి, C/o పి. సీతారామస్వామిగారు, ప్లీడర్సు వీధి, పెద్దాపురం;

### లలితకళల సరదా

పింగళ ప్రభాకరరావు C/o పింగళ సీతారామస్వామిగారు ప్లీడర్సు వీధి, పెద్దాపురం; దినవహి సూర్యప్రభావతి C/o డి. బి. సూరపరాజుగారు, వెలంపాలెం, ద్రాక్షారామపోస్టు;

### తమాషాలూ - సరదాలు

ఎస్. జి. జి. కె. ఎం. గుప్త C/o దుర్గా బుచ్చిరాజు, పెద్దాపురం; అత్యాం జగన్మోహన్ C/o మోహన్ బ్రదర్సు పాలకొల్లు; పి. వి. రామారావు C/o రత్నం, రేలంగి; రావులపర్తి అక్కిరాజు C/o ఆర్. ఎ వి. యస్. వెంకటరావు, కొవ్వూరు.

### సినిమాసరదాలు

చావలి చంద్రమౌళి ప్రసాద్ C/o చావలివారి ఇల్లు, ఫ్రెంచిపేట చిలకలపూడి, కృష్ణాజిల్లా; జి.వి. రెడ్డినాయుడు, విద్యార్థి; వసాదువారి వీధి, నరసాపురం; కోలా ఆంజనేయులు, కోర్టు వీధి, ఒంగోలు.

---

[illegible]




తల్లి

రచన : తంగిరాల కృష్ణమోహనరావు

(ఆర్యాపురం)

# బాల సంగ్రాన!

బాలా! నీకు సర్కస్ చూడాలని వుందా? అయితే ఇదుగో ఈ దిగువున 1 మొదలు 50 వరకూ అంకెలు వున్నాయి. ఆ అంకెలు వరుసగా గీతలతో కలిపిచూడు.




ఇటువంటి అంకెల చుక్కల సర్కస్ ఇంకోటి వచ్చేనెల మిఠాయి బాలలో పడుతుంది. చూడు.

కూర్పు : మామిడన్న శాంతకుమారి (బందరు)

## ప్రశ్న—జవాబు

ప్రశ్న: మనము బడికిపోకుండా సమ్మె చేస్తే నష్టం ఎవరికి? కష్టం ఎవరికి?

జవాబు: నష్టం మనకే! కష్టం మనతలిదండ్రులకు, బడి అధికారులకు.

ప్రశ్న పంపినవారు : కనగపల్లి తాండవగోపాలకృష్ణమూర్తి (కోనేటిపురం)

---

అట్టమీది బొమ్మ! ఈనెల అట్టమీదిబొమ్మ ఎవరో తెలుసా? "రత్నమాల"లో యాక్టుచేసిన మాస్టర్ భరణిది. "బాల నేను జట్టు. నాకూ బాలకూ నాలుగోయేడు వచ్చింది తెలుసా?" అంటాడు భరణి నవ్వుతూ నాలుగు పళ్లతో!

# చిత్ర ప్రశ్నలు

**1**

వీధిలోనికుక్క మనఇంటిలోకి ఎప్పుడు జొరబడుతుంది?

**2**

నెమిలి ఎప్పుడు గుడ్లు పెడుతుంది?

**3**

ఏది పడితే కనిపించదు?

**4**

ఏవి గుమ్మంవరకూ వెళ్లి గుమ్మం దాటి వెళ్లవు?

**5**

గజము, గజముకంటే ఎప్పుడు పెద్ద దవుతుంది?

**6**

హనుమంతుడి తోక పొడవు ఎంత?

**7**

తెనుగులో ఒక పెద్దమాట వుంది. దాని పొడుగు, ఆ మాట మొదటి అక్షరానికీ ఆఖరి అక్షరానికీ మధ్య ఎనిమిది మైళ్లువుంది! ఆ మాట ఏది?

**8**

నీకు ఒక్క ముఖ మేవుంది.

అ. రెండు ముఖములు ఎవరికి వున్నాయి?

ఆ. మూడు ముఖములు గలవాడెవడు?

ఇ. నాలుగు ముఖాలు ఎవరికి వున్నాయి?

ఈ. అయిదు తలల వాడెవడు?

ఉ. ఆరు మోములు ఎవరికున్నాయి?

ఊ. పది తలలుగల వాడెవడు?

ఎ. వందవదనాలు ఎవడికున్నాయి?

ఏ. వెయ్యి ముగముల వాడో?

(5వ ప్రశ్న దివాకర్ల సరోజినిపంపింది)

(7,8 ప్రశ్నలు పాలకొల్లునుండి మామిడిపూడి రాధాకృష్ణ పంపినవి)

(జవాబులు ఈ సంచికలోనే)


మిత్రాంజనము
[రిజిస్టర్డు]




నొప్పులకు
బాధలకు
కాల్పులకు
దివ్యాంజనము

అన్ని మందుషాపులలోను దొరకును
ఏజంట్లు కావలయును
మిత్రఫార్మసీ [రిజిస్టర్డు]
తెనాలి. M & S.M.Ry

## పేరులో ఏముంది?

కొందరు దేముళ్ల పేర్లు, కొందరు దేశవీరుల పేర్లు, నాయకుల పేర్లు పెట్టుకుంటారు. కాని, వాళ్లు చేసేపనులు ఆ పేరుకి తగినట్టు వుండవు. పేరులో ఏముందీ? గుణం మంచిదై వుండాలి. ఏం?




ప్రతి ఇంట్లోను వుండవలసిన గాంధీ జీవితబొమ్మల పుస్తకం




క్రౌను 1/4 సైజు-125 పేజీలు-180 బొమ్మలు :
వెల (అట్టబోర్డు అట్ట) రూ 3-8-0; గట్టిఅట్ట రూ 4-0-0
దొరకు చోటు : జాతీయ జ్ఞానమందిరము, 5-ఎ, మోబరీస్ రోడ్డు
రాయపేట, మదరాసు 14.

# ఆంధ్ర భాషకు అవసరమైనవి

## సమాసాలంకారఛందోదర్పణం

హైస్కూలు విద్యార్థులకు అత్యవసరము. కవిత్వము నేర్చుకొనగోరు వారికి కరదీపికవంటిది. 3వ ముద్రణ

గ్లేజుకాగితం వెల 1-0-0

## ఆంధ్రనామ సంగ్రహము

ఆంధ్రపదజాలమును తెలుపు నిఘంటువు. ఇందు ప్రకృతులు, వ్యాకరణాంశములు చేర్చబడినవి.

గ్లేజుకాగితం 136 పుటలు వెల0-12-0

## నీతిచంద్రిక

మదరాసు T B C వారిచే అంగీకరింపబడినది. నీతిని బోధించు కథలనేకములు కలవు.

గ్లేజుకాగితం 144 పుటలు వెల 0-12-0

## అమరకోశము

మూడుకాండలు, మూలమును ముత్యములవంటి పెద్దఅక్షరములలో ముచ్చటగా ముద్రించబడినది.

గ్లేజుకాగితం 148 పుటలు వెల1-4-0

రాయలఆంగ్లో-తెలుగుప్రైమరు 0 6 0

రాయలహిందీ-తెలుగుప్రైమరు 0 6 0

ఆకటిచిచ్చు (ఖండకావ్యము) 0-8-0

వివరములకు :

## రాయలు అండుకో;

పబ్లిషర్సు :: కడప.


# బాలలూ — సినిమాలు

## మదాలస

"ఇది 'బాలరాజు' కన్నా బాగులేదు. దబ్బా పిక్చరు. హాస్యము చేసినచండికా, సదాశివ బ్రహ్మం మాత్రం బాగుగా నటించారు. అంజలీదేవి డాన్సుబాగుంది."

పక్కిహరనాథ్ పట్నాయిక్ (వాల్తేరు)

"మదాలసలో నటులు ప్రారంభంలో పెట్టి వప్పచెప్పినట్లుగా మాట్లాడారు."

వి. ఆర్. (బెజవాడ)

## బాలరాజు

"ఈచిత్రం మావూళ్లో రాణించింది. నేను రెండుసార్లు చూచాను."

ఈ. యం. నరసయ్య (బళ్లారి)

## మాయరంభ

శ్రీ వరలక్ష్మి ఫిలిమ్సువారు ఆరవంలో మాయరంభ అనేఫిలిం తీస్తున్నారు. ప్రారంభపూజ జూను 16 వ తేదీని జరిగింది. ఈ చిత్రంలో చాలా మంచి పాటలు వుంటాయని తెలుస్తోంది. శ్రీ జగన్నాథ్ గారు డైరెక్టు చేస్తున్నారు.

## భక్తజన


రాగిణీ ఫిలింసువారి భక్తజన ఫిలింను ఈమధ్యనే పత్రికలవారికి చూపించారు. ఫిలిం అరవభాషలో తీసినా, కథఅందరికీ బోధపడింది. పాటలు బాగున్నాయి. ఇందులో శాంతకుమారి, నాగయ్య, బేబీ కృష్ణవేణి బాగానటించారు.



# తారుమారు—కథ

అనగా అనగా ఒక ఇంట్లో ఒక ఎలుక వుండేది. ఆ ఎలుక చాలా తెలివైనది. ఆఇంట్లోనే ఒకపిల్లికూడ వుంది. ఆపిల్లి ఆ ఎలుకని ఎలాగైనా చంపేద్దాం అని ఆలోచిస్తూవుంది. కాని, ఎలుక దొరుకుతుందా?

ఒకనాడు పిల్లి చిన్న మూతిగల ఒకపెద్ద కుండని తెచ్చి, ఆకుండలో జున్నుముక్క పెట్టింది. ఎలుక ఆ కుండలోనికి దూరితే దానిని పట్టుకుందాం అని పిల్లి ఆలోచన. ఎలుక ఆ కుండలో దూరింది. పిల్లి చటుక్కున తన తలని ఆ కుండలోనికి దూర్చింది. పాపం! ఆపిల్లి తల ఆకుండలో ఇరుక్కుంది! రాదు! కుండనిపైకీ కిందికీ ఆడించింది. కుండ పగిలింది. ఎలుక పారి పోయింది! చూశారా గమ్మత్తు! పట్టుకుందాం అనుకుంటే తానేపట్టుబడింది! ఇదే తారుమారు.




పంపినవారు: కొల్లూరు సావిత్రి (వాల్తేరు)


(ఈ బొమ్మ డిసెంబరు 1947 బొమ్మల పోటీలో 3 వ బహుమానము పొందింది.)







కాకినాడ బాలలు



చి॥ యద్దనపూడి హైమవతీదేవి,

చి॥ సీతారామమోహనరావు, లలితాదేవి.


## ఒకముఖ్య గమనిక

ప్రతిఇంట్లోనూ కర్పూరం వుండితీరాలి. కాని కర్పూరాన్ని కొనేటప్పుడు ప్రతిగృహయజమానీ గమనించవలసింది ఏమిటంటే, తాము కొనే కర్పూరం ఉత్తమరకం అవునా, కాదా, అని.

**గడియారం మార్కు కర్పూరం** చాలా ఉత్తమమైనది. గడియారంమార్కు కర్పూరం అన్నిషాపులలోను దొరుకుతుంది. లేదా, యీ క్రింది అడ్రసువద్ద దొరకుతుంది.

**గోపాల్‌జీ చాంప్‌షీ అండ్ కో.,**

30, గోవిందప్పనాయక్ వీధి, జి. టి. మద్రాసు.



**ఆయుర్వేదాశ్రమం లిమిటెడ్ మదరాసు 17**

## రైతు — కూలి

రచన : పోలాకి సత్యనారాయణమూర్తి

కష్టించి మడి దున్ని
గంజి త్రావుచు రేయి
పవలు చమటోర్చు మన
బాంధవుడు రైతు

పూటకుండిన తిండి
పూటకు లేదంచు
దినము పేదరి కాన
పనిచేయు కూలీ

కట్టు వస్త్రాలకును
కడుపుతిండికి కూడా
బాధపడి ధాన్యాన్ని
పండించు రైతు

ఇంటి చాకిరిచేసి
పంట చేదోడౌచు
కటికి రేయిని పొలము
కాయురా కూలీ

---

### సమస్యా పద్యం

(పేజీ 38)

ఇప్పురమే లెదు పార్థివు
డిప్పుడు నీవద్దకంపె
నిదిగో నయ్యా
చప్పున అంగడి తలుపులు
కప్పుకు, సంపంగినూనె
కావలెవింకే!

---

## దాగుడు బాలలు

బాలలూ!

ఈసంచికలో కొందరు బాలల ఫోటోలు వేశాము. వాటిక్రింద పేరుగాని, ఊరుగాని లేదు. చూడండి. బహుశా ఆఫోటో మీదేమో! ఆ ఫోటో మీదైతే - వెంటనే మీ పేరు, ఎడ్రసు, ఎన్నో పేజీలో ఆఫోటో పడిందో అంతా సరిగా రాసి పంపండి. గురుతు పట్టిన దాగుడు బాలలకు-వారి పేరున ఒక సం॥ వరకూ 'బాల' ఉచితంగా పంపిస్తాము. ఈనెల దాగుడు బాలలు ఈనెలాఖరు లోగానే మాకు తెలియ జేయాలి.

జూన్ సంచికలోని దాగుడు బాలలలో ఈదిగువ బాల మాత్రమే తనఫోటోను గుర్తించ గలిగింది. గాన ఈ బాలకు ఈ నెలనుండి 1 సం॥ వరకూ "బాల" ఉచితముగా పంపబడును.

అవసరాల గిరిజాకుమారి (కాకినాడ)

---


### జంతుప్రశ్నలు

(జవాబులు)

1. కుక్క; 2. ఏనుగ: 3. పంది; 4. గొఱ్ఱె: 5. జీబ్రా; 6. సింహం; 7. గాడిద; 8. ఒంటె; 9. జిరాఫీ; 10. ఎలుక; 11. నంది; 12. ఎనుబోతు.

# గొలుసు పజిల్

1 3 5 7 9



2 4 6 8 10

పై గొలుసు పజిల్ క్రింద ఇవ్వబడిన అక్షరాలతో పూర్తి చేయాలి. ప్రతి అంకె మూడక్షరాలు కలిగి వుంటుంది. మాటల అర్థాలు కూడ ఇవ్వబడ్డాయి.

అక్షరాలు: క, న, వ, గ, పా, చా, బా, లి, రు,
రు, రు, కు, పు, వు, గు, గు, ము,

**మీదినుంచి క్రిందికి (ఏటవాలుగా)**

1. తియ్యగావుంటుంది
3. దీనిలో నూనెకాచుతారు (తిరగేసి చదువు)
5. కాకరకాయ ఇలావుంటుంది.
7. వంకాయ ఇది పులుసులోవేస్తారు
9. ఇది పట్టిన పండ్లుతినకూడదు.

**కిందినుంచి మీదికి (ఏటవాలుగా)**

2. ఊళ్లో కలి
4. తిరగేస్తే కొండ
6. పుట్టి అనికూడా దీనినిఅంటారు
8. దీనిని ముట్టుకోకు
10. వీరిని పూజించు.

కూర్పు : మలపాక రామం (భీమవరం)

బాలా! ఈ పైగొలుసు పజిల్‌ను పోస్టు కార్డుమీద రాసి, పూర్తిచేసిమాకు పంపండి.

మీ పూర్తి యడ్రసు పజులు దిగువున రాయండి..

జవాబులు మాకు ఈనెల 25 తేదీలోగా చేరాలి.

"పజిలన్నయ్య"
బాల ఆఫీసు,
మదరాసు 4.

# గీతల పజిల్

క్రిందటినెల గీతల పజిల్ కు సరియైన సమాధానం.

**1.** స్వాగతం; **2.** ఆగస్టు; **3.** ఉయ్యాల; **4.** గయ్యాళి; **5.** వాకిలి; **6.** కోకిల; **7.** నాగలి; **8.** గగనం; **9.** కవ్వము; **10.** గవ్వలు **11.** కట్నము; **12.** రాట్నము.

## సరియైన జవాబులు పంపినవారు :

కుంహారి:-కె. చూడామణి; విశాఖపట్టణము:-కె. కనకదుర్గకమల; ఎస్.వి.ఎల్. ప్రసాద్; ఎమ్. పాండురంగ; బి. ఆర్. పుట్రేవు; బెజవాడ:-కె. వెం. శ్రీనివాస రావు: జి. రంగారావు; వి. దుర్గాప్రసాద్; ఎస్. అప్పారావు; పి. వి. ఆర్. భాస్కర్ రావు; ఎల్. గోపాలకృష్ణమూర్తి; పి. శ్రీరామచంద్రన్; పి. రంగా రావు; జి. నాగభూషణం: సి. కృష్ణ; రాజమండ్రి:-అ. కామేశ్వరి; సి. శేషగిరి రావు; వై. నాగేశ్వరరావు; పి. వెంకటరమణ; జి. సౌభాగ్యలక్ష్మి; పామర్రు:. డి. ఆర్. కృష్ణప్రసాద్; జి. శేషగిరిరావు; ఏలూరు:-వే. వెంకటరత్నము; డి. ఎల్ నారాయణ; కె. పుష్కరము; కె. ఎల్. కుమార్; టి. భగవతి కుమారి; వాల్తేరు:.పి. సూర్మారావు; పి. లక్ష్మీకాంతం; వి. వెంకటలక్ష్మి; ఎ. వెంకట రావు; పి. హరనాధ్ పట్నాయకు; కర్నూలు:-వంశీధర్ నాథ్; కె. పట్టాభి రామన్; మద్రాసు:-ఇ. శ్రీరామచంద్రరావు; కె. భాస్కరం; తెనాలి:- పి. శ్రీరామమూర్తి; వి. సుబ్రహ్మణ్యం; టి. సావిత్రి; టి. సాంబశివరావు; శోరుకొల్లు:-జి. యస్. గోపాలకృష్ణ; గుంటూరు:-వి. ఉమాదేవి; పి. నాగేశ్వర రావు; వి. మీనాక్షి; W. శేషగిరిరావు; ఎ. వి. సూర్యనారాయణమూర్తి; కె. కోటిలింగం; కె. వి. విశ్వేశ్వర ప్రసాద్: బి. సుబ్బారావు; కాకినాడ:- యస్. భ్రమరాంబదేవి; యస్. యస్. ప్రకాశరావు; కె. పుల్లేశ్వర రావు; ఎమ్. బాబూరావు; పి. సారధి; ఎమ్. కృష్ణమూర్తి; టి. సత్యనారాయణ మూర్తి; కె. భాస్కరరావు; పాలకోలు:-వై. సత్యనారాయణమూర్తి; బి. వి. రాధారమణగుప్త; ఎమ్. ప్రభాకరరావు; కె. లక్ష్మయ్య; ఎమ్. ఎల్. నరసింహ రావు; ఉంగుటూరు:-టి. రామమోహనరావు; దుమ్మగూడెం:-ఎమ్. జపులాపురి దాస్; కుర్దారోడ్:-జి. లావణ్యారాం; కర్లపాలెం:-బి. వి. మహాలక్ష్మిదేవి; విజయనగరం:-డి. వి. మార్తాండశాస్త్రి; కొవ్వూరు:-ఎల్. కమల; జగ్గయ్యపేట:- కె. ఎన్. రామయ్య; ఎలప్రోలు:-ఎ. వెంకటేశ్వరరావు: బందరు:-ఎస్. సుబ్బా రావు; బి. వసుంధిరాదేవి; ఎమ్. రంగనాధరావు; నెల్లూరు:-సి. నామవలి; ఓ. లీలావతి; ఎస్. శివసుందరం; వి. సుబ్రమణ్య సవరసింగ్; అల్లగడ్డ:-వి. శ్రీని వాస; నందలూరు:-వి. కమలాభాయి; పడమటలంక:-జి. అన్నపూర్ణాదేవి; శోవల:-ఇ. రాధాకృష్ణారావు; గురజ:-జి. మాధవరావు; చోడవరం:-ఎమ్. కృష్ణ మూర్తి; ఉండి:-తాయి మీరాదేవి; చీరాల:-పి. అమరేశ్వరరావు; వెంకటరెడ్డి

పాలెం:-ఎ. రాజ్యలక్ష్మి; బరంపురం:-పి. సుబ్బారావు; పంగిడిగూడెం:-వి. రాధాకృష్ణ; అనంతపురం:-కె. కనకప్రసాదరావు; వేటపాలెం:-కె. వి. ఎస్. రామారావు; జయపురం:-ఎస్. లలిత; రేపల్లె:-వి. శారదాంబ; ఎ. ప్రసాదరావు; కె. గోవిందరావు; జి. సుందరరామశాస్త్రి; అన్నవరం:-ఎమ్. శేషమ్మ; చింతలూరు:-టి. శేషమ్మ; అనకాపల్లి:-బి. గంగరాజు; చికాకోల్:-ఎస్. శారదాంబ; వి. జోగయ్య పంతులు; వి. సీతాలక్ష్మి; మద్దికేరా:-ఎమ్. రాజగోపాలాచార్య; నల్లగండ్ల:-ఎస్. వి. యల్. నరసింహారావు; ఒంగోలు: వి. కేశవులు; పామర్లకోట:-కె. రామసింగ్; తుని:-హెచ్. శతపతి; బళ్ళారి:-ఎస్. కాశీనాథ్; తిరుపతి:-టి. శ్రీనివాసమూర్తి; సికింద్రాబాదు:-ఎస్. సుదర్శనం; నంద్యాల:-పి. నారాయణ & శివరామయ్య; ప్రొద్దుటూరు:-ఎమ్. రామమూర్తి; ఆర్. రామమూర్తి; వి. వెంకటేశ్వర్లు; గుడివాడ:-కె. ఎల్. పి. అర్జునరావు; పెదపూడి:-జె. వి. రామమూర్తి; పెంటపాడు:-జి. రామచంద్రరాజన్; సంబల్‌పూర్:-వై. సుబ్బలక్ష్మి; బాపట్ల:-వి. సుహాసినీదేవి; హైదరాబాదు:-సి. శేషగిరిరావు; ఎల్లమపాలెం:-బి. వీరయ్య; సీతానగరం:-బి. కళ్యాణసుందర సీతారాముడు; ధవళేశ్వరం:-ఎమ్. కృష్ణరావు; ఊరుపేరు వ్రాయనివారు:-కె. చార్లి; ఎస్. జానకిరామశాస్త్రి;


## అందరికీ తెలిసిన సంగతి

భోజనపదార్థాలలో మంచి ఇంగువ వేసుకోకపోతే, వంటవండిన పదార్థాలు రుచిగా వుండకపోడమేగాక, జీర్ణంకావనికూడా అందరికీ తెలిసినసంగతే. కాని, మంచిఇంగువఏదో చాలామందికి తెలియదు.

**మంచిఇంగువ కావాలంటే,**
**తిలక్‌మార్కు ఇంగువ కొనండి.**

తిలక్ మార్కు ఇంగువ అన్నిషాపులలోను దొరుకుతుంది, లేదా, యీక్రింది అడ్రసుకు వ్రాయండి.

**గోపాల్‌జీ చాంప్‌షీ అండ్ కో.,**

30, గోవిందప్పనాయక్ వీధి, జి. టి. మద్రాసు.




# రేడియో చిట్టిపాపల ప్రోగ్రాం

ప్రతి శనివారము పొద్దున్న 8-30 నుంచి 9 వరకు

[211 మీటర్లు, 41 మీటర్లమీదా వినొచ్చు]

---

## జులై

### 3 వ తేదీ శనివారం

రారండోయి - పిలుపు; అక్కయ్య ఆశీస్సులు; కబుర్లు; ఇంద్రుడు-కోతి — నాటిక; అనగనగా-కథ; తోడేలు-మేకపిల్ల-పాటకథ; మీ మీకథలు-పాటలు అవీఇవీ; చాలును మన ఆటలు-పాట.

### 10-వ తేదీ శనివారం.

రారండోయి-పిలుపు; అక్కయ్య దీవెనలు-కబుర్లు; వైద్యముతెలిసిన కప్ప నాటిక; మీ పద్యములు-కధలు అవీఇవీ; చేపల నాట్యము-పాటకథ; చాలును మన ఆటలు-పాట.

### 17-వ తేదీ శనివారం.

రారండోయి-పిలుపు; అక్కయ్య దీవెనలు-కబుర్లు; కట్టెలమోపు నాటిక; అనగనగా కథ (పంచతంత్రమునుంచి;) మీ పద్యాలు, కథలు, అవీ ఇవీ; చాలును మన ఆటలు-పాట.

### 24-వ తేదీ శనివారం.

రారండోయి-పిలుపు: అక్కయ్య దీవెనలు కబుర్లు; పిల్లి డాక్టరు-నాటిక; పిల్లల కథలు-అవీ ఇవీ; జేజమామయ్య పాట-తోత్రపాట; చాలును మన ఆటలు పాట.

### 31-వ తేదీ శనివారం.

రారండోయి-పిలుపు; అక్కయ్య ఆశీస్సులు, కబుర్లు; పిసినారి - ఈసప్ నీతికథ; సింహము-చిట్టెలుక-పాట కథ. చాలును మన ఆటలు పాట.



# రేడియో పిల్లల ఆటవిడుపు ప్రోగ్రాం

[211 మీటర్లు, 31.36 మీటర్లమీదా వినవచ్చు]

[ప్రతి ఆదివారం మధ్యాహ్నం 2.15 నుంచి 3 వరకు]

## జులై

### 4 వ తేదీ ఆదివారం

రారా చిన్నిపిల్లలార పిలుపు;ఉత్తరాల సంచి.-కొత్తమెంబర్లు:పసేమిరా.- నాటిక. పుట్టినరోజులు, ఆశీస్సులు; భూప్రదక్షిణం - ఖండాలు - పాటకథ: చిక్కుప్రశ్నలు - మెలికమాటలు; మీపద్యాలు. కథలు-అవీఇవీ; పోదామా - విడిపాట.

### 11 వ తేదీ ఆదివారం

చిన్నిపిల్లలారా - పిలుపు; ఉత్తరాల సంచి.- కొత్తమెంబర్లు: మాయబొక్కా - నాటిక: పుట్టినరోజులు - ఆశీస్సులు; భూప్రదక్షిణం - సముద్రాలు - పాటకథ: గొలుసుమాటలు, ప్రశ్నలు అవీ ఇవీ; పోదామా.- విడిపాట.

### 18 వ తేదీ ఆదివారం

చిన్నిపిల్లలారా - పిలుపు, ఉత్తరాల సంచి కొత్తమెంబర్లు; రామదాసు - నాటిక; పుట్టినరోజులు - ఆశీస్సులు; తాతయ్య పాఠాలు చెప్పడం - రూపకం; ప్రశ్నలు, గొలుసుమాటలు - అవీ ఇవీ; పోదామా పాట.

### 25 వ తేదీ ఆదివారం

చిన్నిపిల్లలార - పిలుపు; ఉత్తరాల సంచి - కొత్తమెంబర్లు; సర్ ఫిలిప్ సిడ్నీ - నాటిక; పుట్టినరోజులు, ఆశీస్సులు; భూప్రదక్షిణం - పర్వతాలు - పాటకథ; అవీ ఇవీ.-గొలుసుమాటలు, ప్రశ్నలు, పోదామా.


“బాల” చందా వివరాలు

సంవత్సరం చందా రూ 5- (ప్రత్యేక సంచికలతో సహా)

విడి పత్రిక ఆరు అణాలుమాత్రమే!

వివరములకు: మేనేజరు, ‘బాల’, లజ్ కార్నర్, మదరాసు 4

## చిత్ర ప్రశ్నలు

(జవాబులు)

1 గంటము (పూర్వం కాగితాలు లేవు ... రోజుల్లో తాటాకులమీద గంటం అనే ... కలంతో రాసేవారు). 2 పుట్ట ...గొడుగు(లేక) కుక్క గొడుగు; 3 ఆసాస ...ండు; 4 చినుకు.

## మాటలు నేర్చుకో

(జవాబులు)

1 మెరుపు; 2 పెరుగు; 3 మరుగు; 4 అరుగు; 5 మెరుగు; 6 పరుపు; 7 ఉరుకు; 8 కొరుకు; 9 నురుగు; 10 తరుగు; 11 వీరుడు; 12 పరులు; 13 నరుడు; 14 కరువు; 15 గురువు; 16 ఎరువు; 17 చెరువు; 18 కరుణ;

## పొడుపుకథలు

(జవాబులు)

1 వీధితలుపు తెరిచివుంటే; 2 నెమిలి గుడ్లుపెట్టదు; 3 చీకటి పడితే; 4 మెట్లుకి 5 మొదటి గజము ఏనుగయి, రెండవ గజము కొలతబద్దయితే; 6 హనుమంతుడి ఇష్టం వొచ్చినంత; 7 ప్రయోజనములు. ఈమాటలో మొదటి అక్షరం "ప్ర" కి, ఆఖరి అక్షరం "లు" కిమధ్య ఒక యోజనము వుంది! 8 అ. అగ్ని; ఆ. దత్తాత్రేయుడు; ఇ. బ్రహ్మ; ఈ. శివుడు; ఉ. కుమారస్వామి; ఊ. రావణుడు; ఎ. శతముఖ రావణుడు; ఏ. ఆదిశేషువు.


# క్షయరోగము

'౧౮ మార్చి 1947 లో, నా స్నేహితుడొకడు, ఆకలి మాంద్యము, దగ్గు, సాయంకాలము జ్వరము మొదలగు క్షయవ్యాధి సూచనలతో బాధపడెను. అనేక విదేశమందులతో చికిత్సబొందినను లాభములేనందున, నేను వానికి శ్రీ రాజకన్నప్పన్ గారి పరిచయముచేసితిని. వారు రోగిని పరీక్షించి, భస్మములను కొన్నిటినిచ్చెను. 10 దినములలో గుణము కనబడి, రోగికి జ్వరము, దగ్గు, తగ్గి, ఆకలి ఎక్కువైనది. చికిత్స పూర్తికాగానే సంపూర్ణారోగ్యము పొందెను. శ్రీ రాజకన్నప్పన్ గారి చికిత్సలో నాకు సంపూర్ణనమ్మకముగలదు. వారికి జయమగుగాక.'

మదరాసు 4-7-1947 Sd. పి. కన్నయ్యనాయుడు.

ఉదయం 8 గం॥ నుంచి 10 గం॥ వరకు డాక్టరుగారిని చూడవచ్చును.

20 రోజులు (ఒక చికిత్స) మందు రూ॥ 20

## డాక్టరు ఎ. సి. రాజకన్నప్పన్

S/o దేవీపండిట్ ఎ. సి. కన్నప్పముదలియార్.

క్షయరోగ వైద్యశాల } 3-ఎ, మొదవాక్కం టాంక్ రోడ్డు, కీల్పాక్ పోష్టు, మదరాస్. (కెల్లీస్ బస్సుస్టాండుదగ్గర)



Edited and Published by N. Raghava Rao, 20, Sundareswar St., Mylapore, Madras 4, Printed by Dr. S. Seshagiri Rao at the Lodhra Press, Kesari Kuteeram Ltd., 15, Westcott Road, Royapettah, Madras-14.

# బాల



## మిఠాయి
## సంచిక

ఆగస్టు 1948

శుభవార్త!
మన బాలకు
ఈ ఆగస్టు నెలతో
ముచ్చటగా
మూడేళ్లు నిండి
నవ్వుతూ
నాలుగో ఏడు
వస్తోంది!

## మిఠాయి సంచిక

వెల 1 రూపాయి
మాత్రమే.

## బాలలూ! త్వరపడండి!

పుట్టినరోజు 'బాల'
ఎన్నో ఎన్నో
వన్నెవన్నెల
చిన్నారికథలూ
చిత్రవిచిత్రాలతో
ఫక్కునవ్వే
ఎక్కువ పేజీలతో
చక్కగా అలంకరించుకొని
ఆగస్టు నెలలో వస్తుంది.

## ఒక రూపాయి
## దాచుకోండి!

మీవూళ్లో "బాల"ను అమ్మే ఏజంటుతో
మీకొక మిఠాయి సంచిక కావాలని
ఇప్పుడే చెప్పండి.

చందాదారులు వెంటనే చందాను పంపండి.

వివరములకు: "బాల", మైలాపూరు, మదరాసు 4.



# స్త్రీలు ఇకమీదట బాధ పడరాదు

బాధ కలిగించి అవస్థపెట్టే ఆ చిన్న రోగాలతో స్త్రీలు ఇకమీదట బాధ పడరాదు. శాంతి అశోక ప్రత్యేకంగా స్త్రీవ్యాధులను నివారించడానికి తయారుచెయ్యబడ్డది; ఇందులో చేర్చిన ఓషధులలో స్త్రీల వ్యాధులను పోగొట్టడానికి పూర్వకాలంనుంచి ఉపయోగింపబడుతూ వున్న అశోక కూడా చేరివున్నది. శాంతి అశోక సేవించడం నేడే ప్రారంభించి ప్రకాశవంతమయిన ఆరోగ్యం పొందండి.



# శాంతి అశోక

## ఉత్తమ గర్భాశయ రోగనివారిణి

శాంతికుటీరం, తణుకు, ప. గోదావరి.

సోల్ ఏజెంట్లు:—శ్రీ కృష్ణాజనరల్ స్టోర్స్, తణుకు